www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -307 గురువారం12 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# 73.01 శాతం పోలింగ్





**కార్పొరేషన్లలో అత్యధికంగా నల్లగొండలో 77.36**

**అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12**

**మున్సిపాల్టీల్లో అత్యధికంగా చౌటుప్పల్ 91.91**

**అత్యల్పంగా నందికొండలో 59.68**

**కార్పొరేషన్ల కన్నా మున్సిపాల్టీల్లో 9.83 శాతం అధికం**

**చిన్న చిన్న ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం**

హైదరాబాద్: **ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**
రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,983 వార్డులకు బుధవారం జరిగిన ఎన్నికల్లో 73.01 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 5 గంటలతో ముగిసింది. గడువులోగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. దాంతో కొన్ని చోట్ల రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మిగతా 2లో...

## అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా

# ప్రగతి పయనం

**ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం**



**స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం**

**19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగాం**

**2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు**

**విద్యుత్, సాగునీటి పారుదల రంగాల్లో తిరోగమనం**

**వ్యవస్థల నిర్వీర్యంతో కుంటుపడిన అభివృద్ధి రంగం**

అమరావతి, **ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**
రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలను చవిచూసిందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు రాష్ట్ర పురోగతికి విఘాతం కలిగించిందన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ప్రజా సంక్షేమం అనే కోణంలోనే.. ప్రభుత్వం ప్రతీ నిర్ణయాన్ని తీసుకుంటోందని తెలిపారు. ఏడాదికి రూ.33వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా ఇతర డీబీటీ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. 63.12 లక్షల మిగతా 2లో...

# మోదీ కళ్లలో భయం!

**అమెరికాకు ప్రధాని మోదీ పూర్తిగా లొంగిపోయారు**

**డాటా, ఇంధన భద్రత, రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు**

**అమెరికా ఒత్తిడికి ఉక్కిరిబిక్కిరై భరతమాతను అమ్మేశారు: రాహుల్**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11):-** ప్రధాని మోదీ అమెరికాకు పూర్తి లొంగిపోయారని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత-అమెరికా వర్తక ఒప్పందం ద్వారా 140 కోట్ల భారతీయ ప్రజల భవిష్యత్తును ఆయన తాకట్టు పెట్టారని విమర్శించారు. డాటా, మిగతా 2లో...

## మూడు కార్పొరేషన్లుగా

# హైదరాబాద్ మహానగరం

**జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్లు**

**జీహెచ్ఎంసీ కార్పొరేషన్ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్**

**సైబరాబాద్ కమిషనర్‌గా శ్రీజన.. మల్కాజ్‌గిరికి వినయ్ కృష్ణారెడ్డి**

**ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం**

**క్యూర్ (సీయూఆర్ఈ) పరిధిలో నగర పాలన పునర్వ్యవస్థీకరణ జలమండలి కూడా**



హైదరాబాద్ **ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని రాష్ట్ర ప్రభుత్వం మూడుగా విభజించింది. హైదరాబాద్ మహానగర పరిధిలో వికేంద్రీకృత నగర పాలనను బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్-సీయూఆర్ఈ) పరిధిలో పరిపాలనా పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (జీహెచ్ఎంసీ-1) శాఖ జారీ చేసిన జీ.ఓ.ఎంఎస్. నెం.55 ద్వారా ఈ మార్పులు అమల్లోకి వచ్చాయి. వేగంగా విస్తరిస్తున్న మహానగర ప్రాంతంలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, పౌర సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా 2లో...

# రాష్ట్ర ఎన్నికల కమిషన్ పనిచేస్తోందా?

**కాంగ్రెస్ అరాచకాలపై ఫిర్యాదు చేసినా పట్టింపులేదు**

**ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెసకు ఓటమి తప్పదు**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



## నేడు జాతీయ

# సార్వత్రిక సమ్మె



**పాల్గొంటున్న కార్మిక, కర్షక, సాధారణ ప్రజానీకం**

**కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కన్నెర్ర**

**దేశవ్యాప్తంగా సిద్ధమైన జాతీయ కార్మిక సంఘాలు**

**మద్దతు తెలిపిన వామపక్షాలు, కాంగ్రెస్**

**సమ్మె విచ్ఛిన్నానికి బీజేపీపాలిత రాష్ట్రాల్లో కుట్రలు**

హైదరాబాద్ : **ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**
నేడు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సర్వం సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలోని పది జాతీయ కార్మిక సంఘాలు, 500కు పైగా ఇతర సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా, మిగతా 2లో...

# సర్వం ఏఐ..

**ప్రపంచ దేశాలకు పోటీగా భారత్ స్వదేశీ ఏఐ**

**దేశాల మధ్య శక్తి పోరాటంగా మారిన ఏఐ**

**డిజిటల్ ప్రపంచంపై ఆధిపత్యం కోసం పోటీ**

**'సర్వం ఏఐ'ని రూపొందిస్తున్న భారత్**




హైదరాబాద్ **ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**
కృత్రిమ మేధస్సు (ఏఐ) ఇప్పుడు కేవలం టెక్నాలజీ మాత్రమే కాదు... ఇది దేశాల మధ్య శక్తి పోరాటంగా మారింది. ఎవరు అత్యాధునిక ఏఐ వ్యవస్థలను తయారు చేస్తారు? ఎవరి నియంత్రణలో భవిష్యత్ డిజిటల్ ప్రపంచం ఉంటుంది? అన్న ప్రశ్నల చుట్టూ ప్రపంచ శక్తులు పోటీ పడుతున్నాయి. అమెరికా, చైనా, యూరప్, భారత్... ఈ నాలుగు శక్తులు నాలుగు విధానాలతో ముందుకు సాగుతున్నాయి. తాజాగా 'సర్వం ఏఐ') మోడల్ తో భారత్ కూడా మిగతా 2లో...



## పురపోరులో

# కాంగ్రెస్‌కే పట్టం

**రెండో స్థానంలో బీఆర్ఎస్ : ఎగ్జిట్ పోల్స్ సర్వేల్లో వెల్లడి**

హైదరాబాద్ **ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,:**:రాష్ట్రంలోని116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్ల లో జరిగిన ఎన్నికల్లో పట్టణ ఓటర్లు కాంగ్రెస్‌కే పట్టం కట్టారని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్‌పోల్ సర్వే తేల్చింది. అధికార పార్టీ దాదాపు 70 శాతం మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోనున్నట్టు తెలిపింది. మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు కొనసాగుతుందని పేర్కొంది మిగతా 2లో...

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా ప్రగతి పయనం

(మొదటి పేజీ తరువాయి)

మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రయోజనం చేకూరుతోంద న్నారు. 66 లక్షలకు పైగా విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా ఆర్థిక సాయం అందుతోందని గవర్నర్ వెల్లడించారు. 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్ర అభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగు నీటి పారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవిచూశాయి. గత చేదు అనుభవాలతో విసిగి వేశారిన ప్రజలు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. గత 19 నెలలుగా మా ప్రభుత్వం పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి పథం వైపు పయనిస్తోంది. సూపర్-6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రధానంగా దృష్టి పెట్టాం. విధానాలు, వ్యవస్థలు, వ్యయ ప్రాధాన్యాలలో కీలక సవరణలు చేశాం. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి పది సూత్రాలు రూపొందించాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే దీని లక్ష్యం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశిరచిందని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుతోందని గవర్నర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల చొప్పున 46.86 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతోందన్నారు. దీపం 2.0 పథకం ద్వారా 1.08 కోట్ల మంది పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్ల రిక్రూట్మెంట్ కూడా ప్రభుత్వం పూర్తి చేసిందని వివరించారు. మత్స్యకార సేవలో పథకం ద్వారా 1.2 లక్షల మందికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతోందని తెలిపారు. లక్ష మందికి పైగా హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు 200, 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తోందని గవర్నర్ చెప్పారు. విభజన సమస్యలతో పాటు వారసత్వంగా వచ్చిన ఆర్థిక నష్టాలతో ప్రభుత్వం పాలన ప్రారంభించిందని అబ్దుల్ నజీర్ చెప్పుకొచ్చారు. విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గత పాలకులు ధ్వంసం చేశారన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో అభివృద్ధి ఆగిపోయిందని.. ఆర్థికపరమైన ఇబ్బందులు పెరిగాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా గత పాలకులు పాలించారని.. 22ఏ అధికరణను దుర్వినియోగం చేశారన్నారు. మౌలిక వసతులైన విద్యుత్, సాగునీరు, రహదారులు లాంటి రంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని గవర్నర్ తెలిపారు. 2024లో రాష్టాన్ని పునర్నిర్మాణం చేసే బాధ్యతను ప్రజలు కూటమికి అప్పజెప్పారని.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ప్రభుత్వ పాలన అద్భుతంగా సాగుతోందని వెల్లడించారు. 19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని పునర్నిర్మించి గాడిలో పెట్టిందన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రీస్టార్ట్ అయ్యాయని తెలిపారు. తొలి 9 నెలల కాలంలో దిద్దుబాటు చర్యలు, పాలసీలు, వ్యవస్థల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసి పారదర్శకమైన పాలనను కూటమి ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో పాలన సాగిస్తోందన్నారు. పది సూత్రాలను నిర్దేశిరచుకుని.. ప్రజలకు సుపరిపాలన అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతూకంగా చేసుకుని ప్రభుత్వ పాలన సాగుతోందని అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని గవర్నర్ వెల్లడించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతీ కుటుంబానికి అవసరమైన ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. త్వరలో ఫ్యామిలీ కార్డును అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. పీ4 ద్వారా పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యాలను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎవరూ ఆకలితో ఉండకూడదనే సూత్రంతో 113 నియోజకవర్గాల్లో 205 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని చెప్పారు. త్వరలో మిగిలిన నియోజకవర్గాల్లోనూ గ్రామీణ అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని గవర్నర్ నజీర్ వెల్లడించారు. అందరికీ ఇల్లు.. అనే లక్ష్యంతో గృహ నిర్మాణ పథకాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు గవర్నర్. ఎస్సీ వర్గీకరణ ద్వారా అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా చేసిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం.. వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా బీసీ వర్గాలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేపట్టిందన్నారు. మైనారిటీలకు భద్రత, వారికి అభివృద్ధిలో భాగస్వామ్యం, విద్య, ఆర్థిక సహకారంతో మేలు చేకూరుస్తోందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు.రాష్ట్రం ఐటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లాంటి రంగాల్లో దూసుకెళ్తోందని గవర్నర్ పేర్కొన్నారు. ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యంతో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తోందన్నారు. అంతర్జాతీయ సంస్థలు.. ఏపీని పెట్టుబడులు, నాలెడ్జ్ ఎకానమీకి గమ్యస్థానంగా ఎంచుకున్నాయని తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవటం ద్వారా యువతకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గవర్నర్ వివరించారు. ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గించేలా.. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తోందన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి రూ.2.5 లక్షల వరకూ సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెస్తోందన్నారు. 1.43 కోట్ల పేద కుటుంబాలకు రూ.25 లక్షల వరకు నగదురహిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తోందని అన్నారు. క్యాన్సర్ సహా ఇతర ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా ప్రభుత్వం ఈ బృహత్ పథకాన్ని చేపడుతోందని చెప్పారు గవర్నర్. వృద్ధుల సంఖ్య పెరగడం వివిధ దేశాలకు సవాల్‌గా మారిందని.. దీనిపై సరైన విధానాన్ని రూపొందించాలని సభను కోరుతున్నట్లు గవర్నర్ తెలిపారు. అక్రమ మద్యం తయారీ నుంచి విముక్తి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని.. గంజాయి నిర్మూలనలో పురోగతి సాధించిందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 'వీబీ జీ రామ్ జీ' పథకం ద్వారా ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచారన్నారు. అభివృద్ధి వ్యూహంలో మహిళలే కేంద్ర బిందువులని.. ఆర్థిక భాగస్వాములు, స్వయం పేరుతో డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు బ్రాండింగ్ చేస్తోందన్నారు. ఏడాదికి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని.. వచ్చే ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలనే లక్ష్యాన్ని నిర్దేశిరచుకుందని తెలిపారు. అంగన్ వాడీలను బలోపేతం చేసి.. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ద్వారా మహిళలకు న్యాయ సహకారం కూడా అందిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

# మోదీ కళ్లలో భయం!

(మొదటి పేజీ తరువాయి)

ఇంధన భద్రత, రైతుల ప్రయోజనాల విషయంలో అమెరికాకు మోదీ సర్కారు దాసోహమైందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఎప్‌స్టిన్ ఫైల్స్‌లో ఉన్న అంశాలకు మోదీ భయపడుతున్నారని అన్నారు. భరతమాతను అమెరికాకు అమ్మేశారు. ఇందుకు సిగ్గు అనిపించడం లేదా? అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'అమెరికాకు లొంగిపోవడం మీకు సిగ్గుగా అనిపించడం లేదా?' అని నిలదీశారు. బుధవారం లోక్‌సభలో అధికారపక్ష సభ్యుల తీవ్ర అభ్యంతరాల నడుమ, స్పీకర్ స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ జగదాంబికాపాల్ అడ్డంకుల మధ్య రాహుల్ ప్రసంగిస్తూ ప్రధానిపై నిప్పులు చెరిగారు. బీజేపీ ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్న వారిపై అమెరికాలో కేసు ఉందని, వారిని కాపాడేందుకే ఆ దేశానికి మోదీ లొంగిపోయారని రాహుల్ గాంధీ ఆరోపించారు. సాధారణ పరిస్థితుల్లో దేశాన్ని మోదీ అమ్మబోరని తనకు తెలుసునని, అయితే వారు ఆయన్ను ఒత్తిడిలోకి నెట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని, అందుకే ఆయన దేశాన్ని అమ్మేశారని విమర్శించారు. ప్రత్యర్థి గొంతు పట్టుకుంటే బాధితుడి కళ్లలో భయం ఎలా ఉంటుందో మార్షల్ ఆర్ట్స్ తెలిసిన వ్యక్తిగా తనకు తెలుసునని.. తనకు ప్రధాని కళ్లలో ఆ భయం కనబడుతోందని చెప్పారు. 140 కోట్ల మంది ప్రజల అత్యంత ముఖ్యమైన డాటా అమెరికాకు ఉచితంగా వెళుతోందని, సోర్స్ కోడ్‌ను వెల్లడించరని, వారికి 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడే అందుకే ఇచ్చారని ఆరోపించారు. వ్యవసాయ యాంత్రీకరణతో చక్కగా సాగు పనులు చేసుకుంటున్న రైతులు, అమెరికా వ్యవసాయ విధానం దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన టెక్స్‌టైల్స్ తుడిచిపెట్టుకుపోయాయని, జీరో శాతం టారిఫ్ ఉన్న బంగ్లాదేశ్ మన వస్త్ర పరిశ్రమను కుప్పకూలుస్తోందన్నారు. మన ఇంధన భద్రతను కూడా అమెరికాకు తాకట్టుపెట్టారని, మనం ఏ ఇతర దేశం నుంచీ చమురును కొనుగోలు చేయలేమని చెప్పారు. ఏ భారతీయ ప్రధానీ ఇలా చేయరని, అందులో ఎలాంటి హేతుబద్ధతా లేదని చెప్పారు. అమెరికా తన డాలర్‌ను కాపాడుకోవాలనుకుంటోందని, అందు కు మనం సహకరిస్తున్నామని చెప్పారు. పారిశ్రామిక వేత్త అనిల్ అంబానీ పేరు ఎప్‌స్టిన్ ఫైల్స్‌లో ఉందని, ఆయన్ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. అనిల్ అంబానీని ఎప్‌స్టిన్‌కు కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి పరిచయం చేశారని ఆరోపించారు. ఆదానీపై ఉన్న కేసులకు సంబంధించి అమెరికాలో సమన్లు జారీ అయ్యాయని గత 18 నెలలుగా భారత ప్రభుత్వం స్పందించడం లేదని చెప్పారు.

# పురపోరులో కాంగ్రెస్‌కే పట్టం

(మొదటి పేజీ తరువాయి)

. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ దక్కించుకునే అవకాశం ఉందని అంచనా వేసింది.ఫలితంగా ఆ పార్టీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల వరకు రాష్ట్రంలో తన బలాన్ని మరింతగా పెంచుకునే అవకాశం ఉందని తెలిపింది. ఎగ్జిట్ పోల్ అంచనా ప్రకారం 68 నుచి 76 మున్సిపాల్టీలు కాంగ్రెస్, 29 నుంచి 36 మున్సిపాల్టీలను బీఆర్ఎస్, మూడు నుంచి ఐదు మున్సిపాల్టీల వరకు బీజేపీ గెలిచే అవకాశముందని తెలిపింది. 0 నుంచి 1 వరకు ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. 8 నుంచి 14 మున్సిపాల్టీల్లో రెండు పార్టీల మధ్య కొద్దితేడాతో ఫలితాలు మారే అవకాశం ఉందని వెల్లడించింది.మొత్తం 116 మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ కు 36 శాతం, బీఆర్ఎస్‌కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఎంఐఎంకు 2 శాతం ఓట్లు వచ్చే అవ కాశాలు ఉన్నాయని పేర్కొంది. వార్డుల వారీగా చూస్తే.. కాంగ్రెస్ పార్టీ 1210 నుంచి 1290 వార్డుల్లో, బీఆర్ఎస్ 860 నుంచి 930, బీజేపీ 250 నుంచి 270, ఎంఐఎం 35 నుంచి 44, సీపీఐ 12 నుంచి 17, సీపీఎం 10 నుంచి 14, ఇతరులు 90 నుంచి 110 వార్డులు గెలుచుకునే అవకాశముందని సర్వే తెలిపింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ కూడా గెలిచే అవకాశాలు లేవని తేల్చింది. అయితే వార్డుల వారీగా చూస్తే ఆ పార్టీ రెండో స్థానంలో నిలవనుందని పేర్కొంది.

బీకాన్ సంస్థ సర్వే ప్రకారం కాంగ్రెస్ పార్టీ 80-85 మున్సిపాల్టీలను గెలవబోతోందని అంచనా వేసింది. ఇక బీఆర్ఎస్ 8-10, బీజేపీ 4-6 మున్సిపాలిటీలను కైవసం చేసుకోబోతోందని, 21 మున్సిపాల్టీల్లో హంగ్ లేదా ఇతరులు కైవసం చేసుకోబోతున్నట్టు తేల్చింది.

ఆపరేషన్ చాణక్య సర్వే ప్రకారం మొత్తం మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్ 1400-1449 (48.0 శాతం) బీఆర్ఎస్ 745 -793 (26.06 శాతం), బీజేపీ 358-399 (13.04శాతం), ఎంఐఎం 150 -187(6.03 శాతం), జనసేన 30-35 (1.02 శాతం) ఇతరులు 80-119(4శాతం) కైవసం చేసుకోబోతున్నట్లు తేల్చింది.

# 73.01 శాతం పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం మందకొడిగా మొదలైన పోలింగ్ మధ్యాహ్నానికి పుంజుకుంది. 7 కార్పొరేషన్లలో 66.05 శాతం, 116 మున్సిపాల్టీల్లో 75.88 శాతం నమోదైంది.కార్పొరేషన్లతో పోల్చుకుంటే మున్సిపాల్టీల్లో 9.83 శాతం పోలింగ్ ఎక్కువగా నమోదైంది. ఉదయం ఏడు నుంచి 9 గంటల వరకు మొదటి రెండు గంటల్లో 11.06 పోలింగ్ నమోదు కాగా, అ తర్వాత 9 నుంచి 11 గంటల వరకు 28.48 శాతం ఓటింగ్ నమోదైంది. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 48.54 శాతం, ఒంటి గంట నుంచి 3గంటల వరకు 62.55 శాతం, ఓవరాల్‌గా 73.01 శాతంగా పోలింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. కార్పొరేషన్లలో అత్యధికంగా నల్లగొండలో 77.36 శాతం, ఆ తర్వాత భద్రాద్రి కొత్త గూడెంలో 74.52 శాతం పోలింగ్ నమోదైనట్టు పేర్కొంది. అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12 శాతం, ఆ తర్వాత కరీంనగర్‌లో 62.98 శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాల్టీల్లో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో 91.91 శాతం, ఆ తర్వాత మూడు జిల్లాలో 90 శాతానికి పైగా పోలింగ్ జరిగింది.

ప్రశాంతంగా పోలింగ్..

మున్సిపల్ ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయి. ఉదయం ప్రశాంతంగా ప్రారంభమైనప్పటికీ పోలింగ్ ముగిసే సమయానికి రాష్ట్రంలో చిన్న చిన్న ఘటనలు నమోదయ్యాయి. ప్రధాన పార్టీల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పలు చోట్ల రాజకీయ పార్టీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి, ఎంపీ అర్విద్ పోలీసులతో బాహాబాహికి దిగారు. అయితే ఉన్నతాధికారులు సర్దిచెప్పడంతో వారు శాంతించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నేడు జాతీయ సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. దీనికి సీపీఐ(ఎం), సీపీఐ వంటి వామపక్షపార్టీలు, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షపార్టీలు కూడా మద్దతు ప్రకటించాయి. దేశవ్యాప్తంగా 30 కోట్ల మంది ప్రజానీకం ఈ సమ్మెలో పాల్గొంటున్నట్టు అంచనా. వీరిలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల కార్మికులు, గ్రామీణ ప్రాంత వ్యవసాయ కార్మికులు, రైతులు, ఇతర చేతివృత్తుల శ్రామికులు భాగస్వాములవుతున్నారు.

ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానున్న నాలుగు లేబర్ కోడ్‌లు కార్పొరేట్లకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని కార్మిక సంఘాలు విశ్లేషణాత్మకంగా కార్మి కులకు వివరించాయి. సమ్మె సన్నాహకాల్లో భాగంగా బుక్‌లెట్లు, కరపత్రాలు, గ్రూప్ మీటింగ్‌లు, గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. దేశంలోని పలు ప్రాంతాల్లోని పనిప్రదేశాలు, పారిశ్రామిక వాడలు, గ్రామీణ ప్రాంతాల్లో విభిన్న కళారూపాల్లో సమ్మె ప్రాధాన్యతను వివరిస్తూ కళా ప్రదర్శనలు నిర్వహించారు.

కార్మికుల ఉనికికే ప్రమాదం

గురువారం జరుగుతున్న జాతీయ సార్వత్రిక కార్మిక సమ్మెకు అత్యధిక ప్రాధాన్యత ఉంది. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. దీనితో పాటు రైతాంగాన్ని దెబ్బతీసే విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు, వీబీజీ రాంజీ చట్టం అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. నాలుగు లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులు యాజమాన్యాలకు కట్టు బానిసలుగా మారక తప్పదు. 16,17 శతాబ్దంలో కార్మికులకు ఎలాంటి చట్టాలు లేవు. బానిసలుగా పని చేశారు. లేబర్‌కోడ్‌లు అమల్లోకి వస్తే మోదీ ప్రభుత్వం తిరిగి అవే రోజుల్లోకి కార్మికుల బతుకుల్ని నెట్టేసే ప్రయత్నం చేస్తున్నదని జాతీయ కార్మిక సంఘాలు గొంతెత్తి ఘోషిస్తున్నాయి. ఇలాంటి తిరోగమన చర్యలను అంగీకరించేందుకు కార్మిక వర్గం సిద్ధంగా లేదని దేశ ప్రజానీయం స్పష్టంగా చెప్పదలుచుకుంది. దానిలో భాగంగానే ఈ సమ్మె జరుగుతున్నది.

సమ్మె నిర్వీర్యానికి కుట్రలు

బీఎంఎస్, బీజేపీ, సంఘ్‌పరివార్ శక్తులు లేబర్ కోడ్‌లకు అనుకూలంగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. వీటివల్ల కార్మికవర్గానికి పెద్ద ఎత్తున ప్రయోజనాలు చేకూరుతాయని చెప్తున్నారు. ఈ కట్టుకథలకు దేశవ్యాప్తంగా ప్రధాన మీడియా వత్తాసు పలుకుతున్నది. తప్పుడు రాతలతో కార్మిక వర్గాన్ని భ్రమల్లో ముంచే ప్రయత్నం చేస్తున్నారు. కార్మికుల శ్రేయస్సు కోసం పని చేయాల్సిన కార్మికశాఖ సహా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కార్మికులు సమ్మెలో పాల్గొన వద్దని పరోక్షంగా చెప్తున్నారు. సింగరేణి యాజమాన్యం ఏకంగా ప్రెస్‌మీట్లు పెట్టి కార్మికులు సమ్మెలో పాల్గొంటే ఉత్పత్తి ఆగిపోతుందనీ, కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతుందని బెదిరిస్తున్నది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కోడ్ 13వ తేదీ వరకు అమల్లో ఉన్నందున్న, దాన్ని సాకుగా తీసుకుని పోలీసు యంత్రాంగం, యాజమాన్యాలు సమ్మెపై ఆంక్షలు విధిస్తున్నాయి.

సేవా రంగంపై తీవ్రప్రభావం

సమ్మె కారణంగా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, పోస్టల్, బొగ్గు గనులు, కర్మాగారాలు, రవాణా సేవలు, ప్రభుత్వ రంగ సంస్థలు స్తంభించనున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, ప్రయివేట్ కార్యాలయాలు మూతపడనున్నాయి. సమ్మె ప్రభావంతో ఎక్కడి లారీలు అక్కడే నిలిచిపోనున్నాయి. బస్సులు, టాక్సీలు, క్యాబ్ సేవలు నిలిచిపోయే అవకాశం ఉంది. రైల్వే కార్మికులు, ఉద్యోగులు కూడా సమ్మెలో భాగస్వాములు అవుతున్నారు.

# సర్వం ఏఐ..

(మొదటి పేజీ తరువాయి)

ఈ పోటీలో తనదైన పంథాను ఎంచుకుంది.

భారత్ ఇప్పుడే పూర్తి స్థాయి ఏఐ శక్తిగా ఎదగకపోయినా, వేగంగా ముందుకు సాగుతోంది. స్టాన్‌ఫర్డ్ గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ ర్యాంకింగ్స్ ప్రకారం అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. ఏఐని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, భారతీయ భాషలకు ప్రాధాన్యతనివ్వడం, సామాజిక సమస్యలకు పరిష్కారాలు, 22 షెడ్యూల్ భాషలకు మద్దతు, విదేశీ ఏఐపై ఆధారపడడాన్ని తగ్గించడం, దేశీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, 'బుల్ బుల్ వీ3' వంటి భాషా మోడళ్లను అభివృద్ధి పరచడం వంటి లక్ష్యాలతో భారత్ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలోనే 'సర్వం ఏఐ' ప్రారంభమయింది. భారతీయ అవసరాలకు పూర్తిగా సరిపోయే ఏఐగా ఇది రూపొందుతోంది.

# రాష్ట్ర ఎన్నికల కమిషన్ పనిచేస్తోందా?

**హైదరాబాద్, ఫిబ్రవరి 11**: "కాంగ్రెస్ పార్టీ పోలింగ్ బూత్‌ల లోపల, బయట పోలీసుల సమక్షంలోనే విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ చేసింది. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ రాష్ట్ర ఎన్నికల కమిషన్, పోలీసుల నుంచి ఏ మాత్రం స్పందన లేదు. తెలంగాణలో ఎన్నికల కమిషన్ పనిచేస్తుందా? అనే అనుమానం కలుగుతోంది. డబ్బు, అధికార బలంతో గెలవాలని ప్రయత్నించిన కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలే గుణపాఠం చెప్తారు" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని కుట్రలు చేసినా మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని, బీఆర్ఎస్ కూడా అరకొర తప్పితే గెలిచేదేమీ లేదన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించబోమని, తమ కార్యకర్తలు ప్రతిఘటించి, ఎదురుతిరిగితే పరిస్థితులు దారుణంగా ఉంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్ దాడుల ఘటనలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీని అశాస్త్రీయంగా మూడు భాగాలుగా విభజించిందని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసమే ఒక కార్పొరేషన్‌ను దారుస్సలాం కేంద్రంగా ఉన్న మజ్లిస్ పార్టీకి కట్టబెట్టే ప్రయత్నం చేసిందన్నారు.

# మూడు కార్పొరేషన్లుగా హైదరాబాద్ మహానగరం

(మొదటి పేజీ తరువాయి)

ఈ మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమించింది. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌కు గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్ గిరి మూడు మున్సిపల్ కార్పొరేషన్ల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను యథాతథంగా కొనసాగించింది. సీఎంసీకి శ్రీజన, ఎంఎంసీకి వినయ్ కృష్ణారెడ్డిని కమిషనర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150 డివిజన్లు డీలిమిటేషన్‌తో 243 అయ్యాయి. విలీన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలో 57 డివిజన్లు ఏర్పాటయ్యాయి. మొత్తం 300 డివిజన్లకు విస్తరించింది.

**జీహెచ్ఎంసీ పునర్విభజన..**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించింది. ఆయా జోన్ల పరిధిలో సర్కిళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

శంషాబాద్ జోన్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్చార్మినార్ జోన్: సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్.

ఖైరతాబాద్ జోన్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట

రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్

గోల్కొండ జోన్: గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్

సికింద్రాబాద్ జోన్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)ను మూడు జోన్లతో ఏర్పాటైంది. 14 సర్కిల్స్, 74 వార్డులతో ఉంటుంది. మల్కాజ్‌గిరిజోన్: కీసర, అల్వాల్, బోయిన్‌పల్లి, మౌలాలీ, మల్కాజ్‌గిరి. ఉప్పల్ జోన్ : ఘట్‌కేషర్, కాప్రా, నాచారం, ఉప్పల్, బోడుప్పల్. ఎల్బీనగర్ జోన్ : నాగోల్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)**

కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటైంది. 16 సర్కిల్స్, 76 వార్డులతో ఉంటుంది.

కూకట్‌పల్లి జోన్ : మాదాపూర్, ఆల్విన్ కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట

శేరిలింగంపల్లి జోన్ : నార్సింగి, పటాన్‌చెరు, అమీన్‌పూర్, మియాపూర్, శేరిలింగంపల్లి

కుత్బుల్లాపూర్ జోన్ : చింతల్, జీడిమెట్ల, కొంపల్లి, గాజులరామారం, నిజాంపేట, దుండిగల్, మేడ్చల్

**జలమండలి విజభన..**

జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఓఆర్ఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రెటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది.

ప్రత్యేక అధికారిగా జయేష్ రంజన్ బాధ్యతలు స్వీకరణ

గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్ గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లకు ప్రత్యేక అధికారిగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్.వీ కర్ణన్ బాధ్యతలు స్వీకరించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా జీ. సజన, మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా టీ. వినయ్ కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం12 ఫిబ్రవరి 2026

# నేడు జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి




**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**
బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్మిక,వాణిజ్య, ఆర్థిక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12 గురువారం దేశ వ్యాప్తంగా జరిగే భారీ సార్వత్రిక సమ్మెను మహిళలు, మహిళా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ పి.ప్రేమ్ పావని,తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా, రక్షణలు యూనియన్ హక్కును దెబ్బతీస్తున్న నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలనీ,విబి-జి-రామ్-జి చట్టాన్ని రద్దు చేసి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలనిచిన్న, సన్నకారు రైతులకు, వ్యవసాయ కార్మికులకు హాని కలిగించే కొత్త విత్తనం చట్టం అదేవిదంగా విద్యుత్ నిబంధనలు వెనిక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. అంగన్ వాడి,ఆశ వర్కర్స్,మధ్యన భోజన పథకంలో మహిళలు ఎక్కువ పని చేస్తున్నారని వారికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. దశాబ్దాలుగా కష్టపడి సంపాదించుకున్న కార్మికుల రక్షణలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూల్చివేసిందని, ఈపి ఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా పథకాలను బలహీనపరుస్తున్నారని,12 గంటల పనిదినాలకు తలుపులు తెరిచేసిందని వారు తెలిపారు.దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 12వ జరిగే చారిత్రాత్మక సార్వత్రిక సమ్మెలో భాగంగా ముషీరాబాద్ బాగ్ లింగం పల్లి నుండి ఇందిరా పార్క్ వరకు భారీ కార్మికుల ప్రదర్శనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నండూరి కరుణ కుమారి,మహిళా సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాల నళిని, శ్రామిక మహిళా ఫారం హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

## : నారపల్లి విద్యుత్ శాఖ ఏఈ వి. ప్రదీప్ కుమార్



**ప్రజావినికిడి, (మేడిపల్లి):**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నారపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల అభివృద్ధి పనులు, చెట్ల కొమ్మల నరికివేతల సందర్భంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నారపల్లి విద్యుత్ శాఖ ఏఈ వి. ప్రదీప్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్వతాపూర్ ఏజిఎల్ పరిధిలో ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సప్తగిరి కాలనీ , సత్తిరెడ్డి ఏజిఎల్ బావి,ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్,సేజ్ స్కూల్ ఏరియా, బాపూజీ నగర్, సూర్యోదయ కాలనీ,ధరణి కాలనీ,సుదర్శన్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని అన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం అయిదు గంటల వరకు పోచారం పరిధి లోని ఇన్ఫోసిస్ హస్టల్స్, కాలనీలు, సరెనియా హిల్స్, పోచారం శివాలయం పరిసర ప్రాంతాలు,అన్నా నగర్,పోచారం విలేజ్,డాక్టర్స్ కాలనీ,విజయ్ సాయి ఎన్ క్లేవ్,గెలాక్సీ టవర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని అన్నారు. ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విష్ణుపరి ఫీడర్ పరిధి లోని విష్ణుపురి కాలనీ, లేక్ వ్యూ కాలనీ, భవానినగర్, పన్నాల ఎన్ క్లేవ్, సాయికృష్ణనగర్ ఫేజ్ 1,2, వినాయకనగర్, సాయిఐశ్వర్య కాలనీ రోడ్ నంబర్ 1 నుండి 6,హరిణి మ్యాన్షన్, సత్యనారాయణ పురం రోడ్ నంబర్ 6,అపార్ట్‌మెంట్ ల ప్రాంతంలో కరెంట్ ఉండదని అన్నారు . ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సత్యనారాయణ పురం ఫీడర్ పరిధి లోని వెంకటరమణపురం, సత్యనారాయణ పురం,సాయి ఐశ్వర్య కాలనీ, పర్వతాపూర్ పాత గ్రామపంచాయతి ఏరియా,సాయి మహదేవ్ నగర్, ఇంద్రప్రస్థ ఎన్ క్లేవ్, ఆర్కే న్యూస్ కరెంట్ ఉండదని అన్నారు . మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం అయిదు గంటల వరకు శివాలయాలు ఫీడర్ పరిధి లోని బ్యాంక్ కాలనీ, బండి సత్తయ్య కాలనీ,శంకర్ నగర్, న్యూసాయినగర్, కెనరానగర్,గణేష్ నగర్,విహారిక కాలనీ,శ్రీరామ ఆర్టీసీ కాలనీ, శ్రీపాద ఎన్ క్లేవ్, పార్వతినగర్ లలో విద్యుత్ సరఫరా ఉండదని నారపల్లి ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు .

# బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని బహిరంగ ఉరితీయాలి

## హైదరాబాదులో సఖి మహిళా మండలి సోదరీమణుల నిరసన ప్రదర్శన

### ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకోవాలి







**ప్రజావినికిడి,(హైదరాబాద్): ఫిబ్రవరి 11**
ఎల్బీనగర్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద సఖీ సోదరిమణులు కొవ్వొత్తులతో భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేయడం జరిగింది.బీహార్ రాష్ట్రంలో వికాస్ మహతోష్ అనే దుర్మార్గుడు అభం శుభం తెలియని చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన కు నిరసనగా హైదరాబాద్ సఖి సోదరిమణులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది.భారతదేశంలో బాల బాలికలపై అత్యాచారాలు, మానభంగాలు, యాసిడ్ దాడులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేయడం వంటి దుర్మార్గమైన పనులు చేస్తున్న నరహంతకులను పబ్లిక్ లో ఉరితీయాలని హైదరాబాద్ సఖి మహిళా మండలి డిమాండ్ చేస్తున్నది.భారత పార్లమెంట్లో పబ్లిక్ లో ఉరి తీసే చట్టాలను తీసుకురావాలని అందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మహిళలపై దాడి చేయాలన్నా, మానభంగాలు చేయాలన్నా, హత్యలు చేయాలన్నా గజగజ వనికి పోవాలని, అటువంటి బలమైన చట్టాలను పార్లమెంట్లో తీసుకురావాలని హైదరాబాద్ సఖి మహిళా మండలి డిమాండ్ చేస్తున్నది.భారతదేశంలో స్త్రీలకు స్వేచ్ఛ లేదు. భారతదేశంలో స్త్రీ ఒంటరిగా తిరిగే స్వాతంత్రం రాలేదు.ఒంటరిగా వెళ్లిన మహిళ లేదా బాలిక తిరిగి వచ్చేదాకా నమ్మకము లేని దుర్భర దారిద్రేస్థితిలో మనం జీవిస్తున్నాం. సమాజం తలదించుకోవలసిన పరిస్థితి నెలకొంది.మహిళలపై బాలికలపై అత్యాచారాలు చేస్తూ, మానభంగాలు చేస్తూ, మహిళలను కిరాతకంగా చంపి వేస్తున్న దుర్మార్గులను నడిరోడ్డులో ఉరి తీసే చట్టాలను పార్లమెంట్లో అమలు చేయాలని హైదరాబాద్ సఖి మహిళా మండలి డిమాండ్ చేస్తున్నది.ఈ కార్యక్రమంలో సఖి మహిళా మండలి సోదరీమణులు కడారి అన్నపూర్ణ యాదవ్,ఎం సంగీత,పట్నాల సావిత్రి,రజిత, లక్ష్మి,అనిశెట్టి లక్ష్మీ యాదవ్,బత్తుల వరలక్ష్మి యాదవ్, పిట్ట కడప రాణి, వనిత, అనసూయ, మంజుల,లక్ష్మి, పుణ్య,ఉదయ తదితర సోదరీమణులు పాల్గొన్నారు.

# వాలెంటైన్స్ డే మన సంస్కృతి కాదు




**ప్రజావినికిడి,(అంబర్ పెట్):**
వాలెంటైన్స్ డే జరుపు కోవడం మన సంస్కృతి కాదని బజరంగ్ సేన రాష్ట్ర ఎన్ ఆర్ లక్ష్మణ్ అన్నారు. యువతలో వాలెంటైన్స్ డే వేడుకల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో కాచిగూడలోని బజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు మాట్లాడుతూ, వాలెంటైన్స్ డే జరుపుకోవడం భారతీయ సంస్కృతి కాదని పాశ్చాత్య సంప్రదాయం అని అన్నారు.తల్లి దండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ ఈ వేడుకల సాంస్కృతిక ప్రభావాల గురించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడి, ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతైనా ఉందని సూచించారు.
వాలంటైన్స్ రోజున పబ్‌లు,హోటళ్లు, మాల్స్,రిసార్ట్స్ ఇతర వ్యాపార సంస్థలు వాణిజ్య ప్రయోజనాల కోసం విస్తృతంగా ప్రోత్సహిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.పాశ్చాత్య సాంస్కృతిక ఆచారాల ప్రభావాన్ని పరిమితం చేసే దిశగా విస్తృత చర్చ అవసరమని అభిప్రాయపడ్డారు.యువతను ఉద్దేశించి ప్రవీణ్ యాదవ్ మాట్లాడుతూ, భారతదేశం యొక్క సమృద్ధమైన సాంస్కృతిక వారసత్వంపై గర్వించాలన్నారు. శివాజీ జయంతి, మహా శివరాత్రి వంటి పండుగలను ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలిపారు. భారతీయ సాంస్కృతిక విలువలను పాటించాలని హితవు పలికారు. సమావేశంలో తెలంగాణ ఉపాధ్యక్షుడు ప్రభు బిరాదర్,సంయుక్త కార్యదర్శి ఆర్తి మహేంద్రకర్, మనోజ్ మొగల్గిద్ద, ప్రవీణ్ యాదవ్, రమేశ్వర్ మిశ్రా, అజయ్ నాయుడు,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చంపపేట్ డివిజన్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ప్రజావినికిడి, (ఎల్బీనగర్):**
చంపాపేట డివిజన్ పరిధిలోని ఉదయ్ నగర్ కాలనీ నందు జరుగుతున్న నాల పనుల్లో బాగంగా యువ నాయకులు గండికోట శ్రీనాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ రోజు చుట్టుపక్కల కాలనీవాసులు(ఉదయ్ నగర్ కాలనీ,సూర్య నగర్ కాలనీ,ఎం.ఆర్.ఆర్.కాలనీ,పవన్ పురి కాలనీ,పద్మా నగర్ కాలనీ,న్యూ పద్మ నగర్ కాలనీ,పద్మ ఎంక్లేవ్) కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ,ఇట్టి నాల పనులు సకాలంలో పూర్తి అయితే చుట్టుపక్కల కాలనీవాసులకు డ్రైన్స్ అలాగే వరదనీటి సమస్యల నుంచి పూర్తి ఉపశమనం కలుగుతుంది అని అన్నారు.ఇప్పటికే మీ యొక్క చొరవతో ఎస్.ఎన్.డీ.పీ.పనులు దాదాపు 95% పూర్తి కావడం జరిగింది అని గుర్తు చేశారు.కావున మిగిలిన పనులు కూడా పూర్తి చేయాలని కోరారు.అలాగే ఇట్టి నాల విస్తరణ పనుల్లో భాగంగా ప్రతి ఒక్క ఇంటి యజమానులు స్వతహాగా ముందుకు వచ్చి తమ స్థలం ఇవ్వడం జరిగింది అని,కేవలం ఒక ప్రైవేటు వ్యక్తి వారికి ఉన్న స్థలంలో దాదాపు రెండున్నర ఫీట్ల స్థలం ఇస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని సుధీర్ రెడ్డి కి తెలపడం జరిగింది.వెంటనే అట్టి స్థలం కోసం అధికారులతో కలిసి అట్టి ఇంటి యజమానులతో సమావేశం నిర్వహించి మీరు కొంత స్థలం ఇస్తే చుట్టుప్రక్కల కాలనీవాసులకు ఎంతో మేలు చేసినవారు అవుతారు అని తెలిపారు.అట్టి నాల విస్తరణ పనుల్లో భాగంగా ధ్వంసమైన కాంపౌండ్ వాల్ మళ్ళీ నూతనంగా కట్టిస్తామని వారికి హామీ ఇచ్చారు.అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ,ఇట్టి నాల వెడల్పు పనుల్లో భాగంగా అధికారులు తమ రూల్స్ ప్రకారం పనులు చేపట్టడం జరుగుతుంది అని అన్నారు.సకాలంలో పనులు పూర్తి చేసి కాలనీవాసులకు వరదనీటి సమస్యల నుంచి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏ.సీ.పీ.ప్రతాప్,ఈ.ఈ.కార్తిక్,ఏ.ఈ.సురేష్,నాయకులు ఓరుగంటి వెంకటేష్,కృష్ణమాచారి, రాజిరెడ్డి, రోజారెడ్డి,రవిముదిరాజ్,చీర శ్రీనివాస్,మల్లేష్ గౌడ్,కొత్తపేట ప్రభాకర్, అంజిరెడ్డి, యాదిరెడ్డి,ఐద్ద కళ్యాణ్,సదానంద్ రెడ్డి,సురేందర్ రెడ్డి,కనకేశ్, సతీశ్, రమాదేవి, వసంత, చందుయాదవ్, జగదీష్ చుట్టుపక్కల పలువురు కాలనీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పనికిరాని అక్రిడేషన్ కార్డులు మాకెందుకు..

## భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్



**ప్రజావినికిడి (సికింద్రాబాద్):**ప్రభుత్వం జారీ చేసే అక్రిడేషన్ కార్డులు జర్నలిస్టులకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయి పనికిరాని అక్రిడేషన్ కార్డులు మాకెందుకు అని సత్యం గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రిడేషన్ కార్డులు ఉన్నప్పటికీ కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సరైన గుర్తింపు లభించడం లేదని, ఈ అక్రిడేషన్ కార్డుల ద్వారా లభించాల్సిన సౌకర్యాలు ఆరోగ్య పథకాలు,బీమా సదుపాయాలు పూర్తిస్థాయిలో అమలు లేవని అన్నారు.కార్డు ఇవ్వడంలో కఠినమైన అర్హతలు,పత్రాల సమర్పణ అడుగుతున్నప్పటికీ ప్రయోజనం మాత్రం కనిపించడం లేదేమని ప్రశ్నించారు. జర్నలిస్టుల భద్రత, గౌరవం కోసం అక్రిడేషన్ కార్డులు ఉండాలి కానీ అది కేవలం గుర్తింపు కార్డు గానే ఉందని వీటివల్ల జర్నలిస్టులకు ఒరిగేదేమీ లేదని, వీటి ఆధారంగా ఇచ్చిన హెల్త్ కార్డులు ఒక వెల్నెస్ సెంటర్లో తప్ప ఇంకెక్కడ సరిగా పనిచేయడం లేదని పైగా ఈ కార్డులు ఇవ్వటానికి ఎన్నో షరతులు పెట్టడం తప్పని అన్నారు. జర్నలిస్టు మేధావులు మౌనంగా ఉంటే స్థలాలు వచ్చేనా డబుల్ బెడ్రూంలు ఇచ్చేనా ఇతర ప్రయోజనాలు కలిగేనా.అక్రిడేషన్ కార్డులు సక్రమంగా జారీ చేసి వాటి వల్ల వచ్చే ప్రయోజనాలను కల్పించాలని భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్ డిమాండ్ చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఆడపిల్లల భద్రత ముఖ్యం..

## దానికి షీ టీమ్స్ కట్టుబడి ఉంది.. -విమెన్ సేఫ్టీ డిప్యూటీ కమిషనర్ టి. ఉషా రాణి..

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
మల్కాజ్‌గిరి కమిషనరేట్‌లోని మహిళా భద్రత డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, బాలికలు మహిళలను వేధించే ఎవరినీ పోలీసులు వదిలిపెట్టబోరని, మహిళలు భయం లేకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలలు, కూరగాయల మార్కెట్లు ఇతర బహిరంగ ప్రదేశాలలో షీ టీమ్స్ సాధారణ దుస్తులలో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయని ఆమె తెలియజేశారు. మహిళలను వేధించే లేదా వేధించే వ్యక్తులను సరైన ఆధారాలతో పట్టుకుని,కోర్టుల ముందు హాజరుపరుస్తారు. వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ అందిస్తారు.
మల్కాజ్‌గిరి కమిషనరేట్‌లోని మహిళా భద్రత డీసీపీ పర్యవేక్షణలో, ఎల్బీనగర్ లోని సీపీ క్యాంప్ ఆఫీస్‌లో ఈవ్-టీజర్లకు కౌన్సెలింగ్ సెషన్లు నిర్వహించారు. 16.01.2026 నుండి 31.06.2026 వరకు,మహిళలు మరియు బాలికలను వేధించిన మొత్తం 81మంది నేరస్థులను (56 మంది మేజర్లు మరియు 25 మంది మైనర్లు) షీ టీమ్స్ అరెస్టు చేశాయి. కౌన్సెలింగ్ ఎల్బీనగర్ సి పి క్యాంప్ ఆఫీస్‌లో, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో, ప్రొఫెషనల్ కౌన్సెలర్ల సహాయంతో అందించబడింది.ఇంకా,గత నెల 16 నుండి 3 వరకు మొత్తం 99 ఫిర్యాదులు అందాయి.



### ఫిర్యాదుల స్వభావం:
- ఫోన్ కాల్స్ ద్వారా వేధింపు..28
- సోషల్ మీడియా అప్లికేషన్ల ద్వారా వేధింపు..26
- ప్రత్యక్ష/శారీరక వేధింపులు..45

### తీసుకున్న చర్యలు:
- క్రిమినల్ కేసులు నమోదు..8
- చిన్న చిన్న కేసులు నమోదు 25
-కౌన్సెలింగ్ అందించబడింది 55 మంది

### ముఖ్యమైన కేసులు:
ఒక మహిళను వేధించినందుకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు టీమ్‌కు అందిన ఫిర్యాదు ఆధారంగా,టికెట్ బుకింగ్ సమయంలో పొందిన తన వ్యక్తిగత వివరాలను దుర్వినియోగం చేసిన ప్రైవేట్ బస్సు డ్రైవర్ తనను వేధించాడని ఒక మహిళ ఫిర్యాదు చేసింది.ఆమెకు నగరం వెలుపల పరీక్ష ఉన్నందున, ఆమె ఒక ప్రైవేట్ బస్సులో టికెట్ బుక్ చేసుకుంది. బుకింగ్ ప్రయోజనాల కోసం తన వ్యక్తిగత వివరాలను పంచుకుంది. దీనిని సద్వినియోగం చేసుకుంటూ,
ఆ డ్రైవర్ అసభ్యకరమైన సందేశాలు పంపడం, వేధించడం మొదలుపెట్టాడు, ఫోన్ కాల్స్ చేయడం మొదలుపెట్టాడు, భయం,మానసిక క్షోభ,మానసిక క్షోభకు కారణమయ్యాడు. ఫిర్యాదు అందిన వెంటనే,షీ టీం వెంటనే చర్య తీసుకుని,కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.
ఒక యువతిని వేధించినందుకు, బ్లాక్ మెయిల్ చేసినందుకు ఆ వ్యక్తిపై కేసు నమోదు
షీ టీం అందుకున్న ఫిర్యాదు ఆధారంగా,ఒక యువతి తనకు ఒక సాధారణ స్నేహితుడి ద్వారా ఒక వ్యక్తితో పరిచయం ఏర్పడిందని, కొంతకాలం పాటు అతనితో సంబంధంలో ఉన్నానని ఒక యువతి తెలిపింది. తరువాత,ఆ వ్యక్తి ఆమెకు ప్రపోజ్ చేశాడు,దానిని ఆమె తిరస్కరించింది.
ఆ తర్వాత, అతను ఫోన్ కాల్స్ టెక్స్ట్ సందేశాల ద్వారా ఆమెను వేధించడం ప్రారంభించాడు ఆమె వ్యక్తిగత ఫోటోలను ఆమె కుటుంబ సభ్యులు స్నేహితులకు పంపుతానని బెదిరిస్తూ ఆమెను బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. ఫిర్యాదు అందిన వెంటనే,షీ టీం వెంటనే చర్య తీసుకుని,కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసింది.
ఒక వితంతువును వేధించినందుకు, వేధించినందుకు ఆ వ్యక్తిపై కేసు నమోదు
షీ టీం అందుకున్న ఫిర్యాదు ఆధారంగా, స్వతంత్రంగా నివసిస్తున్న ఒక మహిళ తన పొరుగున నివసిస్తున్న ఒక వ్యక్తి నిరంతర వేధింపులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు చేసింది. నిందితుడు మొదట్లో చిన్న సహాయం అందించడం ద్వారా పరిచయాన్ని పెంచుకున్నాడుఅలాగే క్రమంగా ఆమె నమ్మకాన్ని పొందాడు. తరువాత అతను ఆమె ఫోన్ నంబర్‌ను పొందాడు. మరియు తరచుగా సందేశాలు,రీల్స్ వీడియోలను పంపడం ప్రారంభించాడు, దీనివల్ల మానసిక ఆందోళన మరియు అసౌకర్యం కలుగుతుంది. పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ,నిందితుడు తన ప్రవర్తనను మార్చుకోలేదు మరియు ఆమెను వేధించడం కొనసాగించాడు, ఆమెను ఆమె కార్యాలయానికి అనుసరించడం సహా,భయం మరియు అభద్రతకు కారణమయ్యాడు. ఫిర్యాదు అందిన వెంటనే,టీమ్ వెంటనే చర్య తీసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసింది.
అధిక ఛార్జీ కంటే ఎక్కువ ధరకు యువతిని వేధించినందుకు రాపిడో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేయబడింది
టీమ్‌కు అందిన ఫిర్యాదు ఆధారంగా,పని నుండి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు రాపిడో ఆటో డ్రైవర్ వేధింపులకు గురైనట్లు ఒక యువతి ఫిర్యాదు చేసింది.
ఆటో ఎక్కిన తర్వాత,డ్రైవర్ అదనపు మొత్తం చెల్లించాలని పట్టుబట్టాడు. ఆమె నిరాకరించినప్పుడు,అతను అరవడం ప్రారంభించాడు. దూకుడుగా ప్రవర్తించాడు.
ఆమె వాహనాన్ని ఆపమని కోరినప్పుడు, అతను నిరాకరించాడు. ఆమె భయపడి ఏడవడం ప్రారంభించింది,
ఆ తర్వాత డ్రైవర్ చివరకు ఆటోను ఆపాడు.ఆమె ప్రయాణం పూర్తి చేయకుండానే దిగిపోయింది, అసురక్షితంగా మరియు బాధగా అనిపించింది.
బాధితురాలు వాట్సాప్ కంట్రోల్ ద్వారా టీమ్‌ను సంప్రదించిన తర్వాత,తక్షణ చర్యలు తీసుకున్నారు, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అదేవిదంగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.
లిఅవగాహన కార్యక్రమాలు:లి
గత నెలలో 16 నుండి 31 జనవరి 2026 మధ్య, మల్కాజ్‌గిరి షీ టీమ్స్ 48 అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, దాదాపు 5,795 మందికి మహిళలకు సంబంధించిన చట్టాలు, హక్కులు,నేరాలు అలాగే భద్రతా జాగ్రత్తలపై అవగాహన కల్పించాయి.

### మెట్రో రైలు డెకాయ్ ఆపరేషన్లు:
మెట్రో రైళ్లలో నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్లలో,4 మంది పురుషులు మహిళలు మాత్రమే ఉండే కంపార్ట్‌మెంట్లలో ప్రయాణిస్తున్నట్లు కనుగొనబడింది. వారికి మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా జరిమానాలు విధించబడ్డాయి.
వేధింపులను ఎదుర్కొంటున్న మహిళలు లిమల్కాజ్‌గిరి వాట్సాప్ నంబర్: 8712662111లి లేదా సంబంధిత ప్రాంతం లిషీ టీమ్ నంబర్లు:లి ద్వారా షీ టీమ్స్‌ను సంప్రదించాలని సూచించారు.
c బేగంపేట 8712665300
c జవహర్‌నగర్ 8712662601
c ఎల్‌బి నగర్ 8712662602
c మల్కాజ్‌గిరి 8712662603
c మేడిపల్లి 8712662600
c వనస్థలిపురం 8712662604
cఉప్పల్ 8712665299
మహిళలు భయం లేకుండా సంఘటనలను నివేదించమని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ షీ టీమ్స్ పి. వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్లు ఎం.ముని,జి. అంజయ్య,అడ్మిన్ ఎస్ఐ శ్రీ రాజు, షీ టీమ్ సిబ్బంది కౌన్సెలర్లు పాల్గొన్నారు.

# ఓటేసిన పలువురు ప్రముఖులు

## కొడంగ్‌లో ఓటేసిన సిఎం రేవంత్ ,మధిరల ఓటేసిన భట్టి విక్రమార్క

హైదరాబాద్,: **ఫిబ్రవరి 11 ప్రజావినికిడి,**
మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్





కోరారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి ధర్మపురి అర్వింద్ తదితరులు కూడా తమ ఓటు హక్కను వినియోగించుకున్నరు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.



# సైబరాబాద్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

## ఎన్నికల తీరును పరిశీలించిన కమిషనర్ రమేశ్

హైదరాబాద్,**ఫిబ్రవరి 11 ప్రజావినికిడి,**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో బందోబస్తు, తీరును సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సీపీ ముందుగా కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావెల్ కోల్ జెడ్పీహెచ్ స్కూల్, ఎల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. అనంతరం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లోని అలియాబాద్ మున్సిపాలిటీలో ఉన్న లాల్ గడి మలక్ పేట్ జెడ్పీహెచ్ స్కూల్, అలియాబాద్ ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా శేరిలింగంపల్లి జోన్ లోని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీల లోని ఇంద్రేశం ఎంపీయుపీ స్కూల్, ఇస్నాపూర్ జెడ్పీహెచ్ స్కూల్, చిట్కూల్ ఎంపీపీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. సైబరాబాద్ సీపీ వెంట డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్., శేరిలింగంపల్లి డిసిపి సీ.హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ ఇన్ ఛార్జ్ డిసిపి సాయి మనోహర్, ఎస్బీ డిసిపి సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, డబ్ల్యు అండ్ ఎస్ డబ్ల్యూ డిసిపి సృజన కరణం, పీడీ సెల్ ఏడీసీపీ సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ ఏడీసీపీ పురుషోత్తం, శేరిలింగంపల్లి ఏడీసీపీ ఉదయ్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగి రెడ్డి, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మున్సిపోల్స్‌లో రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగం

### ఎక్స్ వేదికగా కెటిఆర్ తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్,**ఫిబ్రవరి 11 ప్రజావినికిడి,** మున్సిపల్ ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలో గులాబీ పార్టీ శ్రేణులను ఉద్దేశిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అలానే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ రేవంత్ రెడ్డి పై కేటీఆర్ ఫైర్ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులందరికీ



పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకూ పురపాలక సమరంలో మీరు కనబరిచిన పోరాట స్ఫూర్తి బీఆర్ఎస్‌కు కొండంత బలాన్నిచ్చింది. పార్టీలో ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. రెండేళ్ల పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో ఇంతటి దౌర్జన్య కాండకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు' అని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అక్రమంగా లూటీ చేసిన వేలకోట్ల ప్రజాధనంతో ప్రజాతీర్పునే మార్చాలన్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. పోలీసు శాఖను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపుల పర్వానికి, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రజలకిచ్చిన హామీలను, మొత్తంగా పరిపాలనను గాలికి వదిలేసి రాష్టాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం రేవంత్ రెడ్డిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటుంది' అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## అధికార దుర్వినయోగం...ఉల్లంఘనలు

### మున్సిపోల్స్‌పై హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,**ఫిబ్రవరి 11 ప్రజావినికిడి,:** మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి



విరుద్ధమని ఆక్షేపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు చెప్పారు.

## మహాశివరాత్రి జాతరకు భక్తుల రాకపోకలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు నడపాలి...

**భూక్యా బోస్**



**అనంతగిరి:ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,** జక్కేపల్లి మహాశివరాత్రి సందర్భంగా కోదాడ నుండి చనుపల్లి వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపాలని అనంతగిరి బిఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు...భూక్యా బోస్ కోరారు. బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన జక్కేపల్లి కోటప్ప స్వామి జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని తెలిపారు. కోదాడ నుండి చనుపల్లి వరకు మంచి రహదారి సౌకర్యం ఉన్నందున భక్తుల రాకపోకలకు అనుకూలంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను అభ్యర్థించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా సదుపాయాలు కల్పించడం ద్వారా జాతర విజయవంతంగా నిర్వహించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు

**ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**
మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టులో ఊరట లభించింది. సీఐ విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో నమోదైన కేసులో ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. అదే సమయంలో, ఆయన్ను కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. గత ఏడాది నవంబర్ 12న ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న సీఐని అడ్డుకున్నారని అంబటి రాంబాబుపై కేసు నమోదైంది. ఈ కేసులో ఆయనపై పీటీ వారెంట్ జారీ కావడంతో, పట్టాభిపురం పోలీసులు మూడు రోజుల క్రితం ఆయన్ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుకు సంబంధించి విచారణ జరిపిన గుంటూరు కోర్టు, తాజాగా అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆయన, కోర్టు ఉత్తర్వులతో రేపు విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

## గ్రేటర్ హైదరాబాద్ విభజన సరైనదే

### స్వాగతించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



హైదరాబాద్,**ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ని తెలంగాణ ప్రభుత్వం మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించింది. హైదరాబాద్‌ను మూడు డివిజన్లుగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. 'గ్రేటర్ హైదరాబాద్ ను మూడు కార్పొరేషన్లుగా విభజించడం ద్వారా నగరానికి మంచి జరగబోతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా.. ఇది ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయం కాదు. పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, విపక్షాల అభిప్రాయం తీసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తెలంగాణ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రాంతీయ కార్యాలయంలో నేరుగా సమస్యలు పరిష్కారం అవుతాయి. బీఆర్ఎస్ రాజకీయం కోసం మాట్లాడుతున్నారు. వాళ్లు అధికారంలో ఉన్న రోజుల్లో ఏమీ పట్టించుకోలేదు. రాజకీయాల కోసం ప్రతిపక్షాల విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వేగవంతమైన అభివృద్ధికి ఈ నిర్ణయం గొప్ప ఊతమిస్తుంది. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మక నిర్ణయం.. దీన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా' అని అన్నారు.

## ఎమ్మెల్యే భార్య స్టోర్‌లో చోరీ

### స్టోర్ ఉద్యోగి పనే అని గుర్తించిన పోలీసులు

హైదరాబాద్,**ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సతీమణి అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్న డిజైనర్ స్టోర్‌లో జరిగిన చోరీ కేసును బంజారాహిల్స్ పోలీసులు ఛేదించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఎన్‌బీటీ నగర్‌లో ఓ డిజైనర్ స్టోర్‌ను అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్నారు. ఈనెల 6న ఆ స్టోర్‌లో ఓ చోరీ జరిగింది. ఈ స్టోర్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న అమీనుల్ హక్(38) ఈ చోరీకి పాల్పడ్డాడని పోలీసులు గుర్తించారు. అస్సాంకు చెందిన ఈ నిందితుడు కొన్ని నెలలుగా స్టోర్‌లో నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రివేళ పక్కా ప్రణాళికతో స్టోర్‌లోకి ప్రవేశించిన నిందితుడు.. సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా కిటికీ గుండా లోపలికి వెళ్లాడు. అక్కడ స్క్రూడ్రైవర్ సాయంతో లాకర్ తెరిచి రూ.2.43 లక్షల నగదును చోరీ చేశాడు. దోచుకెళ్లిన ఆ సొమ్మును తన ఇంట్లోని డస్ట్‌బిన్‌లో దాచాడు. మరుసటి రోజుఉదయాన్నే డ్యూటీకి వచ్చిన అమీనుల్ హక్.. స్టోర్‌లో దొంగలు పడ్డారంటూ హడావుడి చేశాడు. సీసీటీవీ కెమెరాల్లో స్పష్టమైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు, క్లూస్ టీమ్ రంగంలోకి దిగింది. కిటికీ వద్ద లభించిన బూట్ల ముద్రలు కీలక ఆధారంగా నిలిచాయి. ఆ షూస్ ముద్రలు పూర్తిగా మ్యాచ్ కావడంతో అమీనుల్ హక్ గుట్టు రట్టయ్యింది. విచారణలో చోరీ చేసినట్లు అమీనుల్ హక్ అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన బంజారాహిల్స్ పోలీసులు.. అతడి నుంచి రూ.2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.


## నలుగురు మంత్రులకు బెదిరింపు లేఖలు

### ఒకే తరహాలో ఉన్న లేఖల సారాంశం

### పోలీసులకు ఫిర్యాదు చేసిన కందుల దుర్గేశ్ పిఎస్

అమరావతి, **:ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**ఆంధ్రప్రదేశ్‌లో కొందరు కీలక మంత్రులకు అజ్ఞాత వ్యక్తుల నుంచి హెచ్చరికలతో కూడిన లేఖలు రావడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. జాగ్రత్తగా ఉండాలంటూ పంపిన ఈ లేఖలపై భద్రతా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఇప్పటికే మంత్రి కందుల దుర్గేష్ పీఎస్.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్‌లకు కూడా ఇదే తరహా హెచ్చరిక లేఖలు అందాయి. ఒకే విధమైన సందేశంతో పలువురు మంత్రులకు లేఖలు రావడం వెనుక ఎవరు ఉన్నారన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లేఖపై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ లేఖల వ్యవహారం అసెంబ్లీ లాబీల్లో విస్తృత చర్చకు దారి తీసింది. హెచ్చరిక లేఖల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ప్రభుత్వం మరింత జాగ్రత్తలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. కందుల దుర్గేష్ మాట్లాడుతూ? 'మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖ చూసి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. నాకు చాలా మంది ఫోన్లు చేశారు. నేను పనిచేసేది టూరిజం లాంటి చిన్న శాఖ. దీంట్లో మావోయిస్టులు లేక రాయాల్సినంత పెద్ద హడావిడి ఏముంటుంది. వ్యక్తిగతంగా, శాఖ పరంగా ఎక్కడ ఎలాంటి తప్పులు ఉండవు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ లేఖలు రాసి ఉంటారు. మావోయిస్టులు లేఖలు ఇలా ఉండవు కదా?' అని అన్నారు.

# మరో 15 ఏళ్లు ఇలాగే కొనసాగాలి



## 24 అజెండా అంశాలకు కేబినేట్ ఆమోదం

- నీటి పారుదలశాఖలో 7,189 నిర్వహణ పనులకు అనుమతి
- గాజువాక పరిధిలో వెయ్యి చదరపు గజాల వరకూ క్రమబద్ధీకరణ
- కూటమి బలం మరింత పెరిగింది
- ఎక్కడా విభేదాలు ఏర్పడలేదు
- ఈ ఐక్యత కింది వరకూ కొనసాగాలి
- గుజరాత్‌లో 5 దఫాలుగా ఒకే ప్రభుత్వం
- అదే స్ఫూర్తితో ఇక్కడా గెలవాలి: సీఎం
- అర్థవంతంగా మాట్లాడాలని సూచన
- మన మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు
- అందరూ అప్రమత్తంగా ఉండాలి: పవన్



అమరావతి, **:ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**
ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై.. 24 అజెండా అంశాలపై చర్చించి ఆమోదం తెలిపింది. నీటి పారుదలశాఖలో 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. భూముల బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో వెయ్యి చదరపు గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పరచుకున్న ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును 30-06-2026 వరకు పొడిగించేందుకు క్యాబినెట్ ఆమోదించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కీసరపల్లి గ్రామంలోని సర్వే నం.29/8లోని 3.84 భూమిని కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ కార్యాలయం, నివాస గృహాల నిర్మాణం' కోసం ఉపయోగించేందుకు అనుగుణంగా గతంలో ఇచ్చిన జీవోలో మార్పు చేస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో 45.60 ఎకరాల ప్రభుత్వ భూమిని కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన కోసం కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. నంద్యాల జిల్లాలో 1500 ఎకరాల భూమిని 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కోసం కేటాయించనున్నారు. ఎకరాకు ఏటా రూ.31,000 లీజ్ చెల్లించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇకపోతే అసెంబ్లీకి సంబంధించిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పాలనలో క్రమశిక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై సీఎం స్పష్టమైన దిశానిర్దేశర చేశారు. కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రుల పనితీరు, ప్రవర్తనపై ఆయన స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. మంత్రులందరూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా అసెంబ్లీలో ఉండాలని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత తమ పేషీల్లో ఉండి ఎమ్మెల్యేల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అసెంబ్లీలో 'ఆవు కథలు' చెప్పవద్దని, సమాధానాలు క్లుప్తంగా, అర్థమయ్యేలా ఉండాలని మంత్రులకు చెప్పారు. మాట్లాడే ప్రతి మాట బాధ్యతగా ఉండాలని హెచ్చరించారు.

# వైసిపి వాకౌట్

## గవర్నర్ ప్రసంగం అడ్డుకునే యత్నం సబలో నినాదాలు చేస్తూ వైసిపి వాకౌట్




అమరావతి **ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు బుధవారం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం అయ్యాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ.. సభ నుంచి వాకౌట్ చేశారు. లడ్డు కల్తీ ఆరోపణలు, నిరుద్యోగ భృతి అంశం, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వంటి విషయాలపై ప్రభుత్వం వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. సభలో స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైసీపీ సభ్యుల నినాదాలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. కొందరు సభ్యులు స్పీకర్ చైర్ వైపు పేపర్లు విసిరి నిరసన వ్యక్తం చేశారు. సభలో క్రమశిక్షణ పాటించాలంటూ స్పీకర్ సూచించినప్పటికీ.. వైసీపీ సభ్యులు ఆందోళన కొనసాగించారు. అనంతరం సభను బహిష్కరిస్తూ వాకౌట్ చేశారు. ఈ సంఘటనతో అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా మరింత వేడెక్కాయి. ప్రభుత్వ-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# అనారోగ్యాన్ని లెక్కచేయని ఓటు స్ఫూర్తి

## అంబులెన్స్‌లో వచ్చి ఓటేసిన దళిత మహిళ






**నర్సంపేట/ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంత విలువైనదో నర్సంపేట పట్టణానికి చెందిన ఓ దళిత మహిళ తన కార్యాచరణతో నిరూపించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 30వ వార్డుకు చెందిన కల్లేపల్లి అనసూర్య (భర్త: వెంకన్న) తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి ఉన్నప్పటికీ ఓటు హక్కును వినియోగించుకోవడంలో వెనుకడుగు వేయలేదు.
రక్తహీనతతో బాధపడుతూ నర్సంపేటలోని వెంకటేశ్వర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె నడవలేని స్థితిలో ఉన్నారు. అయినప్పటికీ "ఓటు మన హక్కు" అనే నమ్మకంతో తన ఓటు హక్కును వినియోగించుకోవాలని సంకల్పించారు. వైద్యుల సూచనల మేరకు ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేకంగా అంబులెన్స్ ఏర్పాటు చేయగా, డాక్టర్ వజ్జ సాగర్ (ఎండి), డాక్టర్ యు. సంపత్ (ఎండిఅనస్థీషియా) పర్యవేక్షణలో ఆమెను పోలింగ్ కేంద్రానికి తరలించారు.
అంబులెన్స్‌లో వచ్చి ఓటు వేసిన అనసూర్యను అక్కడున్న ఓటర్లు, అధికారులు అభినందించారు. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజాస్వామ్య కర్తవ్యాన్ని నిర్వర్తించిన ఆమె చర్య ఓటర్లందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు విలువైనదనే సందేశాన్ని ఆమె స్పష్టంగా చాటిచెప్పారు.

## రూ.1.65కోట్ల ఎర్రచందనం స్వాధీనం

# నలుగురు స్మగ్లర్ల అరెస్టు

### టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడు వెల్లడి




**తిరుపతి(కపిలతీర్థం),ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**

స్మగ్లర్లు ఎంతో తెలివిగా ట్రాక్టర్‌కు అమర్చిన వాటర్ ట్యాంకులో రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన రూ.1.65కోట్ల విలువైన 72 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు అంతరాష్ట్ర స్మగ్లర్లను, ఇద్దరు చిత్తూరు జిల్లా వాసులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ, టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం తిరుపతిలోని కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లె మండలం పింఛా ప్రాజెక్టు సమీపంలో ఒక ట్రాక్టర్ ట్రాలీలో కొంతమంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్రమత్తమై వారిని పట్టుకునే ప్రయత్నం చేశారన్నారు. నలుగురిని అదుపులోకి తీసుకోగా, మిగిలిన వారు పారిపోయారన్నారు. ట్యాంకర్‌లో 72 ఎర్రచందనం దుంగలున్నట్లు గుర్తించారన్నారు. పట్టుబడ్డ వారిలో వేలూరు జిల్లాకు చెందిన ఇద్దరు స్మగ్లర్లు, చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు స్మగ్లర్లు ఉన్నారని తెలిపారు. ఈ అక్రమ రవాణా వెనుక ప్రధాన స్మగ్లర్లను అరెస్టుచేయడానికి దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.స్మగ్లర్లను అరెస్టుచేయడంలో ప్రతిభచూపిన టాస్క్‌ఫోర్సు సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు పాల్గొన్నారు.

# ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కుచ్చుటోపీ

**500 మంది నుంచి 270 కోట్లు వసూళ్లు**

**ఎనిమిదేళ్లయినా అతీగతీ లేని ప్రాజెక్టు**

**ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు**




హైదరాబాద్,**: ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**

ఊదరగొట్టే ప్రకటనలు ఇస్తారు. అతి తక్కువ ధరకే ప్లాట్స్ ఇస్తామంటూ ఊరిస్తారు. తీరా చూస్తే.. డబ్బులు కట్టించుకుని ఏళ్లకు ఏళ్లు.. వారి చుట్టూ తిప్పించుకుంటారు. డబ్బులు చేతిలో పడ్డాక.. ఉసూరమనిపిస్తారు. అంతా రియల్ మాయాజాలం. ఆ రియల్ మాయకు అమాయకులైన జనం మోసపోతున్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి రియల్ మోసాలు చాలా జరుగుతున్నాయి. తాజాగా అలాంటి చీటింగ్ గ్యాంగ్ ఒకటి వెలుగులోకి వచ్చింది. కూకట్‌పల్లిలో వైట్ వాటర్ పేరుతో ప్లాట్స్ అమ్ముతున్నామని ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో మోసం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 500 మంది నుంచి 270 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. పదేళ్ల నుంచి ప్రాజెక్టు పేరు చెప్పి డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వైట్ వాటర్ కన్స్ట్రక్షన్ యజమాని అజయ్‌తో పాటు పలువురుపై కేసుల నమోదు చేసి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ కేసు మూసాపేట పవర్ నగర్ కాలనీకి చెందిన భోగాడి సుజాత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేశారు పోలీసులు. ఐతే ఈ కేసులో ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదు. వైట్ వాటర్స్ యాజమాన్యానికి ఎ÷-లాట్ కొనుగోలు కోసం ఫిర్యాదుదారు సుజాత సుమారు 80 లక్షల రూపాయలు చెల్లించారు. కానీ ఆమె తీసుకున్న ఎ÷-లాట్‌ను బ్యాంకులో తనఖా పెట్టినట్లు ఆమెకు తెలిసింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మరోవైపు వైట్ వాటర్స్ యాజమాన్యం.. ఎ÷-లాట్ల కొనుగోలుదారులకు ఎ÷-లాట్లను స్వాధీనం చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటికే డబ్బు చెల్లించి పదేళ్లు గడిచిపోయిందని బాధితులు చెబుతున్నారు. పైగా ధరలు పెంచడం, ఒకే ప్లాట్‌ను పలుమార్లు అమ్మారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో వైట్ వాటర్స్ యాజమాన్యంపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిజానికి ఈ వైట్ వాటర్స్ ప్రాజెక్టు వెంచర్‌ను 2018లో ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు కేవలం టవర్స్‌లో నిర్మాణం కొంతమేర పూర్తయింది. అ, ఆ టవర్ల బేస్‌మెంట్లు మాత్రమే పూర్తి చేశారు. ఇ, ఈ టవర్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. నమోదు గడువు ఇప్పటికే రెండుసార్లు పొడిగించగా.. ఈ ఏడాది జూన్‌లో అది కూడా ముగియనుందని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. గతంలో డిసెంబర్ 2024, డిసెంబర్ 2025లో ఎ÷-లాట్లు హ్యాండ్ ఓవర్ చేస్తామని చెప్పి మోసం చేసినట్లు బాధితులు చెబుతున్నారు. వైట్ వాటర్స్ యజమాని అజయ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుకున్నారు. ముందస్తుగా డబ్బులు చెల్లిస్తే అతి తక్కువ ధరకే ఎ÷-లాట్ ఇస్తామంటూ అందరిని నమ్మించాడు అజయ్. దీంతో ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో వచ్చిన దీనిని ఆకర్షితులై చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఇప్పటివరకు 270 కోట్ల రూపాయలకు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇక్షచి పోలీసులకి ఇప్పటివరకు వందమంది కాంటాక్ట్ అయ్యారు. మరోవైపు పోలీస్ కేసు నుంచి తప్పించుకునేందుకు అజయ్ కొత్త నాటకానికి తెర తీసినట్టు బాధితులు చెబుతున్నారు. తమకు డబ్బులు ఇస్తామని చెప్పి నమ్మించి.. కొందరి చేత కేసులు విత్ డ్రా చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

-------

# మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ సర్వీసులు**

**శ్రీశైలం, వేములవాడ, ఏడుపాయల తదితర క్షేత్రాలకు**



హైదరాబాద్,**: ఫిబ్రవరి 11 ప్రజావినికిడి,:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి పండుగ ఉండటంతో.. ఈనెల 14 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. అదేవిధంగా కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్‌లు, తాగునీటితోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17 తేదీ వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది. శివరాత్రి ఆపరేషన్స్‌పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ, ఎండీ శ్రీ వై నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. గత శివరాత్రి కంటే ఈసారి 208 బస్సులను అదనంగా సంస్థ నడుపుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో) రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం.. మహిళలకు యథావిధిగా ఉచిత రవాణా సదుపాయం అమల్లో ఉంటుంది. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్ ను లిలిలి.బిణబసబిఇశిబీబ.తిని వెబ్‌సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-234500332లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## అంబటి రాంబాబును వెన్నాడుతున్న కేసులు

### లక్కీడ్రా కేసులో పిటి వారెంట్ జారీ

### బెయిల్ దక్కినా విడుదలలో మరింత ఆలస్యం

**గుంటూరు, : ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసుల పరంపర కొనసాగుతోంది.. అంబటిపై మరో పీటీ వారెంట్ జారీ చేయబడింది. సత్తెనపల్లి పోలీసులు నేడు ఆయనను కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ పీటీ వారెంట్ 2023లో సత్తెనపల్లిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల లక్కీ డ్రా లాటరీకి సంబంధించి జారీ చేశారు. పింఛన్ లబ్దిదారులలో 200 మందిని మినహాయించి, ఇతరులకు లక్కీ డ్రా టిక్కెట్లు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయని గాదె వెంకటేశ్వర రావు, జనసేన జిల్లా అధ్యక్షుడు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. గతంలో వైద్యకళాశాలల ప్రైవేటీకరణ విధానంపై ఆందోళన కేసులో అంబటికి బెయిల్ మంజూరు అయినప్పటికీ, ఈ కొత్త పీటీ వారెంట్ ద్వారా ఆయనపై మరింత విచారణ కొనసాగుతుంది. మున్సిపల్ సివిల్ కోర్టు ఈ వారెంట్ జారీ చేసింది. సత్తెనపల్లి పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు అంబటిని హాజరుపరచనున్నారు, తద్వారా ఆయన విడుదల మరింత జాప్యం అయ్యే అవకాశం ఉంది. గుంటూరు ప్రిన్సిపల్ సబ్ కోర్టులో సత్తెనపల్లి పోలీసులు పీటీ వారెంట్ వేశారు. సత్తెనపల్లిలో సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో అంబటి వసూళ్లకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అంబటి నేతృత్వంలో లక్కీ డ్రా పేరుతో లాటరీ టికెట్ల విక్రయాలు జరిగాయి. సచివాలయ వలంటీర్స్ ద్వారా ఈ టికెట్ల అమ్మకాలు జరిగాయి. 2023లో సంక్రాంతి లక్కీ డ్రా లాటరీ టికెట్లు అమ్మకాలపై సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌లో జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర రావు సబ్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో అంబటి రాంబాబుపై 2023 జనవరి 16న సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఈ లక్కీ డ్రా కేసులో తాజాగా పీటీ వారెంట్ జారీ అయింది. మూడు రోజుల క్రితం కూడా అంబటి రాంబాబుకు సంబంధించిన కేసులో పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. గతేడాది నవంబర్ 12న మెడికల్ కాలేజీల పీపీపీ మోడల్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన అంబటి.. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుని వెళ్లారు. ఈ ఘటనపై అప్పట్లోనే పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయంపై కేసు దర్యాప్తు జరుగుతోందని పోలీసులు పీటీ వారెంట్లో ప్రస్తావించారు.

# శ్రీ శైలం ఘటనపై హ్యూమన్ రైట్స్ కు ఫిర్యాదు..

## పోలీసులు లాఠీచార్జు మానవ హక్కుల ఉల్లంఘనే..

**శ్రీశైల :ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**




శైలంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కు ఫిర్యాదు వెళ్లింది. దీక్ష పూర్తి చేసి, ఇరుముడితో శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నంద్యాల సీనియర్ న్యాయవాది ఫణీంద్రనాథ్ ఈ ఫిర్యాదు దాఖలు చేశారు. భక్తులు శాంతియుతంగా దర్శనం కోసం క్యూలైన్లలో నిల్చున్న సమయంలో ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండా పోలీసులు లాఠీచార్జ్ చేయడం మానవ హక్కుల ఉల్లంఘనగా ఆయన పేర్కొన్నారు. శ్రీశైలం వంటి పవిత్ర క్షేత్రంలో భక్తులపై బలప్రయోగం చేయడం అత్యంత దురదృష్టకరమని ఫిర్యాదులో తెలిపారు. దీక్షతో నియమ నిష్ఠలతో వచ్చిన స్వాములపై లాఠీలు ప్రయోగించడం వారి గౌరవాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పలువురు భక్తులు గాయపడ్డారని, కొందరు భయాందోళనలకు గురయ్యారని వివరించారు. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులు, అలాగే ఆలయ పాలక మండలిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో డిమాండ్ చేశారు. భక్తుల హక్కులను కాపాడేందుకు ఎన్ హెచ్ ఆర్ సి వెంటనే జోక్యం చేసుకుని, స్వతంత్ర విచారణ జరిపించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కూడా ఆయన అభ్యర్థించారు. శ్రీశైలంలో శివ భక్తులపై పోలీసుల లాఠీచార్జ్ ను ఖండించారు. మాజీ సీఎం వైఎస్ జగన్. శ్రీశైలంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైంది. పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా ఏర్పాట్లు చేయలేదన్నారు. శ్రీశైలంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఎన్ హెచ్ ఆర్ సి కు ఫిర్యాదు వెళ్లింది. దీక్ష పూర్తి చేసి, ఇరుముడితో శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నంద్యాల సీనియర్ న్యాయవాది ఫణీంద్రనాథ్ ఈ ఫిర్యాదు దాఖలు చేశారు. భక్తులు శాంతియుతంగా దర్శనం కోసం క్యూలైన్లలో నిల్చున్న సమయంలో ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండా పోలీసులు లాఠీచార్జ్ చేయడం మానవ హక్కుల ఉల్లంఘనగా ఆయన పేర్కొన్నారు..

## అసెంబ్లీలో సబ్జక్టుపై అవగాహనతో రావాలి

**ఆవు కథలు చెప్పి తప్పించుకోరాదు**

**ప్రతిరోజూ అటెండెన్స్ ఉండాల్సిందే -ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు సూచన**

అమరావతి, **:ఫిబ్రవరి 11 (ప్రజావినికిడి,**




వ్యక్తిగత కక్షల ప్రస్తావనకు అసెంబ్లీని వేదికగా చేసుకోవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచించారు. సమస్యలను చర్చించి సిద్దంగా ఉండాలన్నారు. సబ్జక్ట్‌పై ప్రిపేర్ రావాలని అన్నారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలలుగా కూటమి నేతల ఐక్యత కొనసాగుతోందని చెప్పారు. కింది స్థాయిలోనూ ఇదే పరిస్థితి ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో 3 పార్టీల నేతలు సమావేశాలు పెట్టుకుంటూ ఐక్యత పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేల పనితీరుపై అసెంబ్లీ సమావేశాల సమయంలో మాట్లాడతా. 40 మందిని వ్యక్తిగతంగా పిలిపించుకుని మాట్లాడతా. ఆవు కథలు చెప్పడం మాని స్జబెక్ట్ ప్రిపేర్ అయి సభకు రావాలి. ఎవరేం మాట్లాడుతున్నారో నేనూ నోట్ చేసుకుంటా అని అన్నారు. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి ఒక్కరూ ఉండాలి. నేను కూడా రోజూ ఉదయం 11 గంటల నుంచి సెషన్ అయ్యే వరకూ అసెంబ్లీలో ఉంటా. సభలో మాట్లాడేది 5 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీ అని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. అక్కడ ఏం మాట్లాడినా వారి కోసమేనని గ్రహించాలి. అనుకున్న విషయాన్ని 3 నుంచి 7 నిమిషాల్లో మాట్లాడాలి. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు జరుగుతున్న లబ్దిని ఎప్పటికప్పుడు చెప్పాలి. రూ.లక్ష కోట్లకు పైగా హైవే పనులు, రూ.90వేల కోట్లకు పైగా రైల్వే పనులు జరుగుతున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో విశాఖ స్టీల్‌ఎ÷-లాంట్ రూ.450 కోట్ల నష్టంలో ఉంది. నష్టాలను అధిగమించి రూ.54 కోట్ల లాభాల్లోకి రావడం శు భపరిణామం. కేంద్ర ప్రాయోజికత కార్యక్రమాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. అన్ని మతాలను గౌరవించాలి.. భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయకూడదు. జగన్‌కు మతాలపై గౌరవం లేనందునే వైకాపా హయాంలో రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగాయి. తిరుమల శ్రీవారి లడ్డూతో పాటు ఎక్కడ వీలైతే అక్కడ కల్తీకి పాల్పడ్డారు‘ అని చంద్రబాబు అన్నారు.

# రెండో మ్యాచ్‌కు టీమిండియా సిద్ధం



**● టీమిండియా ముమ్మరంగా సాధన ● నేడు నమీబియాతో అమీతుమీ ● గ్రూప్-ఏలో ఢిల్లీ వేదికగా మ్యాచ్ ● సంజూ శాంసన్ ఓపెనర్‌గా బరిలోకి.. ● అభిషేక్ శర్మకు విశ్రాంతినిచ్చే చాన్స్**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని ఘనంగా ప్రారంభించిన టీమిండియా.. రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. గ్రూప్-ఏలో భాగంగా ఢిల్లీ వేదికగా జరిగే మ్యాచ్‌లో నమీబియాతో అమీతుమీ తేల్చుకోనుంది. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో అతి కష్టం మీద గెలిచిన టీమిండియా.. ఈ మ్యాచ్‌లో దుమ్మురేపాలని భావిస్తోంది. ఆదివారమే ఢిల్లీకి చేరుకున్న టీమిండియా ముమ్మరంగా సాధన చేస్తోంది.అయితే ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ మ్యాచ్ ఆడటం సందేహంగా మారింది. ప్రస్తుతం అతను ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడు. అమెరికాతో మ్యాచ్‌లోనూ ఇదే సమస్యతో బ్యాటింగ్ చేసిన అభిషేక్ శర్మ ఫీల్డింగ్‌కు రాలేదు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న అభిషేక్ శర్మ మంగళవారం ప్రాక్టీస్ సెషన్‌లో కనిపించలేదు. అభిషేక్ శర్మ ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడని బ్యాటింగ్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే మీడియాకు తెలిపాడు. మ్యాచ్‌కు ఇంకా రెండు రోజుల సమయం ఉందని, ఆ సమయానికి కోలుకుంటాడని ఆశిస్తున్నామని చెప్పాడు. మరోవైపు సంజూ శాంసన్ నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. మరో ఓపెనర్ ఇషాన్ కిషన్‌తో కలిసి బ్యాటింగ్ సాధన చేశాడు. ఈ క్రమంలోనే నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా నమీబియాతో మ్యాచ్ నుంచి అభిషేక్ శర్మకు విశ్రాంతి కల్పించనున్నారు.న్యూజిలాండ్‌తో సిరీస్‌లో దారుణంగా విఫలమై తుది జట్టులో చోటు కోల్పోయిన సంజూ శాంసన్‌కు ఇది సువర్ణవకాశం. ఈ మ్యాచ్‌లో అతను భారీ ఇన్నింగ్స్‌తో చెలరేగితే.. తుది జట్టులో కొనసాగుతాడు. ఓపెనర్లు ఇద్దరూ లెఫ్టార్మ్ బ్యాటర్లే అయిన నేపథ్యంలో సంజూ శాంసన్ ఫామ్‌లోకి వస్తే అతనికి ప్రాధాన్యత లభిస్తోంది.తీవ్ర జ్వరంతో అమెరికాతో మ్యాచ్‌కు దూరమైన జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అదే జరిగే మహమ్మద్ సిరాజ్‌పై వేటు పడనుంది. అమెరికాతో మ్యాచ్‌లో సిరాజ్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. అయినప్పటికీ బుమ్రా రీఎంట్రీతో అతను బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌తో బరిలోకి దిగితే అర్ష్‌దీప్ సింగ్ కూడా బెంచ్‌కే పరిమితమవుతాడు. అతని స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడుతాడు.మిగతా కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ బ్యాట్ ఝులిపించాల్సిన అవసరం ఉంది.నమీబియాతో తలపడే భారత తుది జట్టు(అంచనా) ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ/సంజూ శాంసన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్/కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా/మహమ్మద్ సిరాజ్, వరుణ్ చక్రవర్తి.



## ధోని ప్రపంచ రికార్డును సమం చేసిన డికాక్

ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026లో చిన్న జట్లు అద్భుతంగా రాణిస్తాయి. పెద్ద జట్లను దాదాపు ఓడించినంత పని చేస్తున్నాయి. మరోవైపు స్టార్ క్రికెటర్లు రికార్డుల వేటలో పడ్డారు. దక్షిణాఫ్రికా స్టార్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డి కాక్ మాజీ భారత కెప్టెన్ ధోనీ ప్రపంచ రికార్డును సమం చేశాడు. కెనడాతో జరిగిన మ్యాచ్‌లో క్వింటన్ రెండు క్యాచ్‌లు అందుకున్నాడు. దీంతో డికాక్ టీ20 ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్ల రికార్డులో ధోనీతో సమం చేశాడు. టీ20 ప్రపంచ కప్‌లో డికాక్ మొత్తం 32 వికెట్లలో భాగస్వామిగా ఉన్నాడు. ధోనీ కూడా తన టీ20 ఇంటర్నేషనల్ కెరీర్‌లో 32 మంది బ్యాటర్లను వికెట్ కీపింగ్ ద్వారా డిస్మిసల్స్ చేశాడు. ఇప్పుడు డి కాక్ చరిత్ర సృష్టించడానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నాడు. నెక్స్ట్ మ్యాచ్‌లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించవచ్చు. పొట్టి ప్రపంచ కప్ చరిత్రలో అత్యధిక వికెట్లలో పాలు పంచుకున్న వికెట్ కీపర్ విషయానికి వస్తే.. టాప్ లో క్వింటన్ డికాక్, ఎంఎస్ ధోనీ ఉన్నారు. కమ్రాన్ అక్మల్ మూడో స్థానంలో, వెస్టిండీస్ దినేష్ రామదిన్ నాల్గవ స్థానంలో, శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర, ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ ఐదవ స్థానంలో ఉన్నారు.కెనడాతో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ప్రొటీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్ అర్ధ సెంచరీ సాధించి 59 పరుగులు చేశాడు. రయాన్ రికల్టన్ 33 పరుగులు, డేవిడ్ మిల్లర్ 23 బంతుల్లో 39 పరుగులు, ట్రిస్టన్ స్టబ్స్ 19 బంతుల్లో 34 పరుగులు చేశారు. కెనడా బౌలర్ అంష్ పటేల్ మెరిశాడు. 31 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు.  214 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన కెనడా జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు మాత్రమే చేసింది. నవనీత్ ధాలివాల్ 64

## షమీ, సర్ఫరాజ్ ఖాన్‌లకు మొండిచేయి




భారత క్రికెట్ నియంత్రణ మండలి 2025-26 సీజన్‌కు సంబంధించి ఆటగాళ్ల వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను విడుదల చేసింది. ఈసారి ప్రకటించిన జాబితాలో ఊహించని మార్పులు చోటుచేసుకున్నాయి. టీమిండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గ్రేడ్ తగ్గడం ఒక ఎత్తైతే.. స్టార్ పేసర్ మహమ్మద్ షమీ, యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్లేయర్లకు అసలు కాంట్రాక్టే దక్కకపోవడం మరో ఎత్తు. గతంలో 34 మందికి చోటు కల్పించిన బీసీసీఐ, ఈసారి ఆ సంఖ్యను 30కి తగ్గించింది. బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఒక నిర్దిష్ట సీజన్‌లో కనీసం నిర్ణీత సంఖ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడితేనే సెంట్రల్ కాంట్రాక్ట్‌కు అర్హత లభిస్తుంది. మహమ్మద్ షమీ, సర్ఫరాజ్ ఖాన్, ఇషాన్ కిషన్, ముకేశ్ కుమార్‌లు గత కాంట్రాక్ట్ సైకిల్‌లో ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడలేదు. షమీ గాయం కారణంగా సుదీర్ఘ కాలం దూరంగా ఉండగా, సర్ఫరాజ్ ఖాన్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నా తుది జట్టులో అవకాశం దక్కలేదు. దీంతో వీరికి కాంట్రాక్ట్ రెన్యూవల్ కాలేదు. ఇది షమీ కెరీర్‌పై సెలక్టర్ల ఆలోచనను స్పష్టం చేస్తోంది. ఈసారి గ్రేడ్-ఏ లో కేవలం శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా మాత్రమే చోటు దక్కించుకున్నారు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గ్రేడ్-బీ కి పరిమితమయ్యారు. వీరు కేవలం ఒకటి లేదా రెండు ఫార్మాట్లకే పరిమితం కావడం లేదా భవిష్యత్తు ప్రణాళికల్లో యువ ఆటగాళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఈ మార్పు జరిగినట్లు తెలుస్తోంది. ఆశ్చర్యకరంగా, నిలకడగా రాణిస్తున్న ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ గ్రేడ్-సి కి పడిపోయారు.

### మ్యాచ్ అనంతరం అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్

## వరుసగా వికెట్లు కోల్పోవడమే మా ఓటమిని శాసించింది

పవర్ ప్లేలో వరుసగా వికెట్లు కోల్పోవడం తమ ఓటమిని శాసించిందని అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ అన్నాడు. ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్ అద్భుతంగా ఆడాడని చెప్పిన రషీద్ ఖాన్.. సూపర్ ఓవర్‌లో కాస్త తెలివిగా బ్యాటింగ్ చేయాల్సిందని అభిప్రాయపడ్డాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా సౌతాఫ్రికాతో బుధవారం ఉత్కంఠగా సాగిన తమ రెండో మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ డబుల్ సూపర్ ఓవర్‌లో ఓటమిపాలైంది. సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్‌ను అఫ్గానిస్థాన్ చేజార్చుకుంది. టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే డబుల్ సూపర్ ఓవర్‌లో గెలిచిన తొలి జట్టుగా సౌతాఫ్రికా చరిత్ర సృష్టించింది.ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన రషీద్ ఖాన్.. తమ ఆటగాళ్ల ప్రదర్శనను కొనియాడాడు. 'మా బౌలర్లు అసాధారణ ప్రదర్శన కనబర్చారు. 10 ఓవర్లలోనే 100 పరుగులు చేసిన సౌతాఫ్రికాను 190 పరుగుల లోపు కట్టడి చేయడం మాములు విషయం కాదు. మా బౌలర్లు అద్భుతమైన పోరాట పటిమను కనబర్చారు. గుర్బాజ్ తనదైన శైలిలో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. మాకు గొప్ప ఆరంభాన్ని ఇచ్చాడు. పవర్‌ప్లే చివర్లో వరుసగా మూడు వికెట్లు కోల్పోవడం మమ్మల్ని వెనక్కి నెట్టింది. దాంతో గుర్బాజ్ కూడా కాస్త ఒత్తిడికి గురై నెమ్మదించాల్సి వచ్చింది. అయినప్పటికీ సూపర్ ఓవర్‌లో 3 సిక్సర్లు కొట్టి మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లడం అద్భుతం.సూపర్ ఓవర్‌లో మేం కాస్త తెలివిగా బ్యాటింగ్ చేయాల్సింది. మాకు విజయవకాశాలు లభించాయి. కానీ బ్యాటింగ్ చేసేటప్పుడు ఇంకాస్త తెలివిగా వ్యవహరించి ఉండాల్సింది. ఒక మంచి డైవ్ లేదా ఒక మంచి బంతి.. ఫలితాన్ని మార్చేసేవి. 1 బంతికి 5 పరుగులు అంటే అది ఎవరికైనా సాధ్యమే. ఈ మ్యాచ్ నుంచి మేం నేర్చుకోవాల్సింది చాలా ఉంది.గత ఏడాదిన్నర కాలంగా ఈ ఒక్క మ్యాచ్ గెలిచి తదుపరి రౌండ్‌కు వెళ్లాలని కష్టపడ్డాం. ఇది చాలా నిరాశ కలిగించే విషయం. కుర్రాళ్ళను మళ్ళీ మానసికంగా సిద్ధం చేయడం కష్టం. కానీ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ఆత్మగౌరవం కోసం ఆడాలి. మా దేశ ప్రజలు మా నుంచి విజయాలను కోరుకుంటున్నారు. వచ్చే మ్యాచ్‌లో మరింత దృఢమైన మనస్తత్వంతో..గొప్ప ప్రణాళికలతో బరిలోకి దిగుతాం.'అని రషీద్ ఖాన్ చెప్పుకొచ్చాడు.



## అభిషేక్ శర్మకు అనారోగ్యం!!



ఫిబ్రవరి 12న జరిగే టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్, నమీబియా ఆడనున్నాయి. ఈ మ్యాచ్‌కు సన్నద్ధమవుతున్న టైంలో ఓపెనర్ అభిషేక్ శర్మ అనారోగ్యానికి గురయ్యాడనే వార్త అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. భారత జట్టు తదుపరి మ్యాచ్ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతుంది, అక్కడ మంగళవారం ఆటగాళ్లు ప్రాక్టీస్ చేశారు. అయితే, అభిషేక్ శర్మ ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదు. మంగళవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో టీం ఇండియా ఆటగాళ్లు చాలా మంది పాల్గొన్నారు. గాయం నుంచి కోలుకున్న ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా ఢిల్లీలో జట్టుతో చేరాడు. సుందర్ కూడా ప్రాక్టీస్ చేస్తున్నట్లు కనిపించాడు. అభిషేక్ శర్మ ఇంకా అనారోగ్యంతో ఉన్నాడని కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ పేర్కొన్నాడు. అనారోగ్యంతోనే అతను అమెరికాతో జరిగిన మ్యాచ్ ఆడాడని తెలిపారు. భారత కోచ్ ర్యాన్ టెన్ డోస్చాట్ మాట్లాడుతూ, "అభిషేక్ శర్మ ప్రస్తుతం కడుపు నొప్పితో బాధపడుతున్నాడు.

## డబ్బు కోసమే పాక్ దిగివచ్చింది: హర్భజన్ సింగ్



టీ20 వరల్డ్ కప్ 2026లో ఫిబ్రవరి 15న జరగనున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌పై నెలకొన్న హైడ్రామా ముగిసింది. మొదట ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తామని భీష్మించుకు కూర్చున్న పాకిస్థాన్, చివరి నిమిషంలో యూ-టర్న్ తీసుకుంది. ఈ నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, సౌరవ్ గంగూలీ, మదన్ లాల్ వంటి ప్రముఖులు తమదైన శైలిలో స్పందించారు. పాక్ వెనక్కి తగ్గడానికి ప్రధాన కారణం డబ్బు, ఐసీసీ జరిమానాల భయమేనని వారు విశ్లేషిస్తున్నారు.టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ పాకిస్థాన్ నిర్ణయాన్ని తీవ్రంగా ఎద్దేవా చేశారు. "భారత్ లేకపోయినా ఈ టోర్నీ సాగుతుంది కానీ, భారత్ లేకపోతే ఏదీ జరగదు అన్న నిజాన్ని పాకిస్థాన్ ఆలస్యంగా గుర్తించింది. బంగ్లాదేశ్‌కు మద్దతు ఇస్తున్నామని, భారత్‌తో ఆడబోమని గొప్పలు చెప్పుకున్నారు. కానీ ఈ మ్యాచ్ ఆడకపోతే వచ్చే ఆర్థిక నష్టం, ఐసీసీ విధించే జరిమానాలు, భవిష్యత్తులో టోర్నీల ఆతిథ్య హక్కులు కోల్పోతామనే భయం వారిని ఉక్కిరిబిక్కిరి చేశాయి. అందుకే ఇప్పుడు గత్యంతరం లేక దారిలోకి వచ్చారు" అని భజ్జీ ఎఎన్ఐతో మాట్లాడుతూ పేర్కొన్నారు.మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మాత్రం ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. క్రీడలను, రాజకీయాన్ని విడివిడిగా చూడాలని ఆయన అభిప్రాయపడ్డారు. "భారత్-పాక్ మ్యాచ్‌లు ఎప్పుడూ ఉత్సాహాన్నిస్తాయి.

# పవన్ షూటింగ్ చూసేందుకు వెళ్లి లాఠీ దెబ్బలు తిన్నా

## నటుడు సంతోష్ శోభన్ వెల్లడి




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కోసం ఒక ఘటనలో తాను కూడా లాఠీ దెబ్బలు తిన్నానని యంగ్ హీరో సంతోష్ శోభన్ తాజాగా వెల్లడించాడు. సంతోష్ శోభన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ' వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. పవన్ కళ్యాణ్‌ను ప్రత్యక్షంగా ఎక్కువసార్లు చూడలేదని, అయితే ఒకసారి 'అత్తారింటికి దారేది' సినిమా షూటింగ్ సమయంలో ఆయనను చూసేందుకు వెళ్లిన అనుభవాన్ని పంచుకున్నారు. సంతోష్ శోభన్ మాట్లాడుతూ.. 'ఆ సమయంలో పవన్ కళ్యాణ్ గారి క్రేజ్ చాలా ఎక్కువగా ఉండేది. షూటింగ్ అవుట్‌డోర్‌లో జరగడంతో భారీ సంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన పోలీసులు జనాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో తోపులాటలు జరిగాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అప్పుడు అక్కడున్న అభిమానులతో పాటు నాకు కూడా లాఠీ దెబ్బలు పడ్డాయి' అని తెలిపారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంతోష్ శోభన్ నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా రిలీజ్‌కు ముందు ఈ వ్యాఖ్యలు చిత్రంపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

-------



# పవన్, సురేందర్ రెడ్డి కాంబో

## పక్కా మాస్ ఎంటర్టైనర్ మూవీ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ గురించి ఫిలిం నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సురేందర్ రెడ్డి అంటే స్టైలిష్ యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాడు. కానీ ఈసారి పవన్ కళ్యాణ్ కోసం ఆయన తన పంథాను పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. పవన్ చేసిన యాక్షన్ సినిమా కంటే భిన్నంగా గతంలో సురేందర్ రెడ్డి అందించిన 'కిక్', 'రేసుగుర్రం' తరహాలో పక్కా హై-వోల్టేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను పవన్ కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే మేనరిజమ్స్‌తో కూడిన వినోదాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రచయిత వక్కంతం వంశీ ఈ స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ప్రభాస్ 'ఫౌజీ' సినిమా హీరోయిన్ ఇమాన్వీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండటం విశేషం. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించి మరో క్రేజీ అప్‌డేట్ ఏమిటంటే, ఇందులో పవన్ కళ్యాణ్‌కు తమ్ముడిగా ఒక యువ అగ్ర హీరో నటించే అవకాశం ఉందని, అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో సాగే పక్కా మాస్ మూవీగా ఇది ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. నిర్మాత రామ్ తాళ్లూరి దాదాపు రూ. 250 కోట్ల భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన రాజకీయ బాధ్యతల నడుమ షూటింగ్‌లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 2026 మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ పక్కా ఎ÷-లాన్‌తో ఉన్నారు. ఇప్పటికే పవన్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26, విడుదల కానుండగా, ఆ వెంటనే ఈ భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది.


# తెలుగు తెరపై అందమైన వారసత్వం .. ఐశ్వర్య అర్జున్!




స్టార్ హీరోల వారసుల పిల్లలు హీరోలుగా తమ జోరు చూపించడం చాలా కాలం నుంచి ఉన్నదే. అయితే స్టార్ హీరోల కూతుళ్లు మాత్రం హీరోయిన్ కావాలనే ఆలోచన చేసేవారు కాదు. అందుకు అనేక కారణాలు కనిపిస్తాయి. అయితే అలాంటి కాలం గతంలోకి జారిపోయి చాలాకాలమే అవుతోంది. సీనియర్ స్టార్ హీరోల కూతుళ్లు హీరోయిన్స్ గా తెరపై సందడి చేయడానికి ఉత్సాహాన్ని కనబరుస్తూ వస్తున్నారు. అలాంటి హీరోయిన్స్ జాబితాలో ఇప్పుడు అర్జున్ కూతురు ఐశ్వర్య కూడా చేరిపోయింది. ఐశ్వర్య 2013లోనే ఎంట్రీ ఇచ్చింది. అయితే కెరియర్ ను ఆమె సీరియస్ గా తీసుకున్నట్టుగా కనిపించలేదు. తమిళ .. కన్నడ భాషల్లో మాత్రమే రెండు మూడు సినిమాలు చేసిన ఆమె, ఇప్పుడు 'సీతా పయనం' అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నెల 14వ తేదీన ఈ సినిమాను భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. ఇది ప్రేమకథా చిత్రం .. ఈ సినిమాకి అర్జున్ దర్శకత్వం వహించడం విశేషం. తండ్రి దర్శకత్వంలో లవ్ స్టోరీస్ చేయవలసి రావడం నిజానికి కాస్త ఇబ్బందిని కలిగించే విషయమే. అయినా అర్జున్ ను ఒక దర్శకుడిగా మాత్రమే భావిస్తూ ఐశ్వర్య ఈ సినిమా చేసింది. గ్లామర్ పరంగా ఐశ్వర్యకి వంక బెట్టాల్సిన అవసరం లేదు. మరి నటన పరంగా ఎన్ని మార్కులు పడతాయనేది చూడాలి. అర్జున్ చాలా కసరత్తు చేసి తీసిన ఈ సినిమా, ఎలాంటి ఫలితాన్ని రాబడుతుందనేది చూడాలి.

# ఇక డాక్టర్ శ్రీలీల

## ఎంబిబిఎస్ పట్టా పుచ్చుకున్న నటి




టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో ఒక అద్భుతమైన ఘట్టాన్ని పూర్తిచేసుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారారు. తన మెడికల్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసిన శ్రీలీల తాజాగా కాన్వోకేషన్ వేడుకలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు ఫొటోలు వైరల్‌గా మారాయి. నిజానికి శ్రీలీల తన తల్లి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత గారిని స్ఫూర్తిగా తీసుకుని మెడిసిన్ వైపు అడుగులు వేశారు. గత ఏడాది చేతినిండా సినిమాలతో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన లక్ష్యం కోసం చదువుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఒక్కోసారి రోజంతా షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే, విరామ సమయంలో పుస్తకాలు చదువుతూ ఆమె పడ్డ శ్రమ ఇప్పుడు ఫలించింది. చిన్నతనంలో తన అమ్మమ్మ అనారోగ్యం పాలైనప్పుడు ఒక వైద్యురాలిగా సేవ చేయాలన్న తన కోరికను ఆమె నేడు నెరవేర్చుకున్నారు.

# 'దృశ్యం 3'లో ప్రకాశ్ రాజ్



బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగణ్ హీరోగా అభిషేక్ పాఠక్ దర్శకత్వంలో 'దృశ్యం 3' సినిమా చిత్రీకరణ ప్రారంభమయింది. ఈ సినిమాలో ప్రకాశ్ రాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్ రాజ్ మాట్లాడుతూ... ఇంత అద్భుతమైన ఫ్రాంచైజీలో భాగమవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ చిత్రంలో తనది ఒక ప్రత్యేకమైన పాత్ర అని తెలిపారు.మరోవైపు ఈ సినిమా నుంచి బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా తప్పుకున్నారు. ఆయన స్థానంలో ప్రకాశ్ రాజ్ నటిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే, ప్రకాశ్ రాజ్ తన పోస్ట్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో తాను ప్రత్యేక పాత్రను పోషిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు ఈ చిత్ర నిర్మాత కుమార్ మంగత్ పాఠక్ స్పందిస్తూ... అక్షయ్ ఖన్నా స్థానంలో జైదీప్ అహ్లావత్ నటిస్తున్నట్టు స్పష్టం చేశారు. అక్షయ్ ఖన్నా పోషించిన తరహా పాత్రనే జైదీప్ చేస్తారని తెలిపారు. ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

# నిఖిల్ స్వయంభు టీజర్ విడుదల




**యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లో అత్యంత** ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. సమ్మర్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో, 3ఆ ఫార్మాట్‌లో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985 నాటి పరాక్రమవంతుడైన యోధుడిగా కనిపిస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు, అద్భుతమైన పీరియడ్ వార్ సీక్వెన్స్‌లతో కూడిన ఈ టీజర్, నిఖిల్ మేకోవర్ మరియు ఆయన యుద్ధ విన్యాసాలను అద్భుతంగా ఆవిష్కరించింది. సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ విజువల్స్ సమకూర్చారు. 'కార్తికేయ-2' విజయం తర్వాత నిఖిల్ నటిస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613